ANDHRAJYOTHY
ఆంధ్రజ్యోతి

కడప
జిల్లా వార్తలు
5
సోమవారం 16 డిసెంబరు 2024

మాట్లాడుతున్న విశ్రాంత ప్రొఫెసర్ హరగోపాల్


ప్రజాస్వామ్య రక్షణకు సంఘటితం కావాలి

● విశ్రాంత ప్రొఫెసర్ హరగోపాల్

కడప మారుతీనగర్, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): దేశంలో ప్రజాస్వామ్య మనుగడకు ముప్పు వాటిల్లుతున్న నేపథ్యంలో ప్రజలంతా సంఘటిత శక్తిగా మారి రక్షించుకోవాల్సిన అవసరం ఉందని సామాజిక విశ్లేషకులు, విశ్రాంత ప్రొఫెసర్ హరగోపాల్ అన్నారు. ఆదివారం స్థానిక హరిత హోటల్‌లో వామపక్ష, ప్రజాసంఘాల ఆధ్వర్యంలో 'ప్రొఫెసర్ సాయిబాబా స్మృతిలో చట్టం అందరికీ సమానమేనా' అనే అంశంపై ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హరగోపాల్ హాజరై ప్రసంగించారు. ప్రజా ఉద్యమాల నుంచి స్వేచ్ఛ, సమానత్వం, సౌభ్రాతృత్వం, సామాజిక న్యాయం ఆవిర్భవించాయన్నారు. అవన్నీ మన రాజ్యాంగంలో ఉన్నాయన్నారు. కానీ వాటికి ముప్పు ఏర్పడినప్పుడు ప్రజలు ప్రతిఘటించేందుకు అవకాశం లేకుండా మన రాజ్యాంగంలో ఉందన్నారు. అందుకనే రాజ్యాంగ నిర్మాత రూపొందించిన చట్టాలు అమలు చేసేవారు మంచిగా చేస్తే అవి మంచిగా అమలవుతాయన్నారు. అలాకాకుండా వ్యతిరేకంగా చేస్తే చట్టాలు చెడుగానే అమలవుతాయని ఆయన ఏనాడో చెప్పారని గుర్తుచేశారు. ఏదిఏమైనా ప్రస్తుత పాలకులు వ్యవస్థలన్నింటినీ ధ్వంసం చేస్తూ చట్టాలకు అతీతంగా పనిచేస్తూ ప్రజలకు వ్యతిరేకంగా ఉన్నారన్నారు. పాలకులే కార్పొరేట్ వర్గానికి అండగా ఉంటూ వారికి సమస్తము దోచిపెట్టేలా చట్టాలను ఉపయోగిస్తున్న తీరు దారుణమన్నారు. ప్రశ్నించే వారిని అదే చట్టాలతో కటకటాల పాలు చేస్తామని బహిరంగంగా చెబుతున్న దశ ప్రస్తుతం దేశంలో ఉందన్నారు. ఏ నేరం చేయని ప్రొఫెసర్ సాయిబాబాను, స్టాండ్లీని అనేక రకాలుగా మానసికంగా హింసించడం బాధాకరమన్నారు. ఇటువంటి వ్యవస్థలో ప్రజలు ప్రజాస్వామిక వాదులు ఉన్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఏదిఏమైనా కలిసికట్టుగా పోరాడుతూ ఇలాంటి వ్యవస్థలను మార్చాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో సీపీఐ, సీపీఎం, ఆర్‌సీపీ, పౌరహక్కుల సంఘం నేతలు గాలి చంద్ర, చంద్రశేఖర్, ఎన్.రవిశంకర్‌రెడ్డి, వెంకటేశ్వర్లు, సలావుద్దీన్, గోపాల్, న్యాయవాది గుర్రప్ప, రాంభూపాల్‌రెడ్డి, అవ్వారు మల్లికార్జున, విరసం వరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

అమరజీవి త్యాగం అందరికీ ఆదర్శనీయం


పొట్టి శ్రీరాములు చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న డీఆర్వో విశ్వేశ్వరనాయుడు తదితరులు

కడప కలెక్టరేట్/క్రైం, డిసెంబరు15 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఆవిర్భావం కోసం పోరాటం చేసి ప్రాణాలర్పించిన అమరజీవి పొట్టి శ్రీరాములు త్యాగం ప్రతి ఒక్కరికీ ఆదర్శనీయమని జిల్లా రెవెన్యూ అధికారి విశ్వేశ్వరనాయుడు అన్నారు. ఆదివారం కలెక్టరేట్‌లోని వీజీఆర్ఎస్ హాల్లో అమరజీవి వర్ధంతి సంస్మరణ సభకు డీఆర్వోతో పాటు కలెక్టరేట్ ఏవో విజయకుమార్ ముఖ్యఅతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా డీఆర్వో మాట్లాడుతూ ప్రత్యేక ఆంధ్ర రాష్ట్రం కోసం 58 రోజుల పాటు నిరాహార దీక్ష చేసి చివరికి 1952 డిసెంబరు 15న ప్రాణాలర్పించిన మహనీయుడు పొట్టిశ్రీరాములు అన్నారు. 25వ ఏటనే భార్య చనిపోవడంతో తన ఆస్తి మొత్తం అన్నదమ్ములకు ఇచ్చి స్వాతంత్ర్య ఉద్యమంలో పాల్గొన్న త్యాగి అన్నారు. 1930లో సత్యాగ్రహంలో పాల్గొని జైలు జీవితం గడిపారన్నారు. తెలుగ వారి ఆత్మ గౌరవం కోసం ప్రత్యేక రాష్ట్రం కావాలని గాంధేయ మార్గాన్ని అనుసరించి పోరాటం చేసి ప్రాణాలర్పించి అమరజీవిగా నిలిచారన్నారు. ఈ కార్యక్రమానికి ముందు అమరజీవి పొట్టిశ్రీరాములు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అలాగే.. ఇన్‌చార్జి ఎస్పీ వి.విద్యాసాగర్ నాయుడు జిల్లా పోలీస్ కార్యాలయంలో అమరజీవి చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. కార్యక్రమంలో ఏఆర్ అదనపు ఎస్పీ రమణయ్య, ఆర్ఐలు ఆనంద్, శ్రీశైలరెడ్డి, వీరేష్, టైటస్ తదితరులు పాల్గొన్నారు.

నేడు 22 గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు

కడప కలెక్టరేట్, డిసెంబరు15(ఆంధ్రజ్యోతి): భూ సమస్యల పరిష్కారానికి సంబంధించి జిల్లాలో సోమవారం 22 గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు జరుగుతాయని కలెక్టర్ డాక్టర్ చెరుకూరి శ్రీధర్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. అట్లూరు, బి.కోడూరు మండలం వెంకటాపురం, బి.మఠం మండలం రాజుపాలెం, సోమిరెడ్డిపల్లి, బద్వేలు మండలం రాజుపాలెం, గోపవరం మండలం మడకలవారిపల్లి, కలసపాడు మండలం శంఖవరం, మైదుకూరు, పోరుమామిళ్ల మండలం ఎల్లోపల్లి, పులివెందుల మండలం చిన్నరంగాపురం, వీఎన్‌పల్లి, కొమ్మద్ది గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు జరుగుతాయని తెలిపారు. అలాగే రాజుపాలెం మండలం టంగుటూరు, సున్నపురాళ్ల పల్లి, మైలవరం మండలం దన్నవాడ, కొండాపురం మండలం ఎర్రగుడి, పెండ్లిమర్రి మండలం తుమ్మలూరు, వల్లూరు మండలం కుమారునిపల్లి, కడపలోని పాలెంపల్లి, ఖాజీపేటలోని వేటూరు, ఒంటిమిట్ట మండలం గంగపేరూరు, సీకేదిన్నె మండలం చిన్నకాంపల్లి, కమలాపురంలోని గంగవరం, విభరాపురం గ్రామాల్లో జరిగే రెవెన్యూ సదస్సులను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ కోరారు.



● కార్పొరేటర్లను సైకిలెక్కిస్తున్న వైనం
● చంద్రబాబు సమక్షంలో నేడు ఎనిమిది మంది చేరిక?
● కార్పొరేటర్ల కోసం చకాచకా పావులు
● రెండో విడతలో మరో 11 మంది సైకిలెక్కేందుకు సిద్ధం
● నీకు కుర్చీలేకుండా చేస్తా
● ఎమ్మెల్యే ఆర్.మాధవి

ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ నటించిన పుష్ప-2 సినిమా ఇంకా నడుస్తోంది. థియేటర్లన్నీ కలెక్షన్లతో కళకళలాడుతున్నాయి. అల్లు అర్జున్ ఆ సినిమాలో ముఖ్యమంత్రితో ఫొటో తీసుకొని వస్తానని భార్యకు చెప్పి వెళ్తాడు. అయితే ఎర్రచందనం స్మగ్లర్‌తో ఫొటో ఏంటంటూ సీఎం నిరాకరిస్తాడు. ఇది అల్లు అర్జున్ ఇగోను బాగా హర్ట్ చేస్తుంది. ఏకంగా సీఎంనే మార్చేసి తన అనుచరుడైన రావురమేశ్‌ను సీఎంగా చేస్తాడు. అది రీల్‌లో... ఇప్పుడు ఇంచుమించు రియల్‌లో కూడా పుష్ప-2లో ఉండే సీన్‌ను తలపించే విధంగా కడపలో టీడీపీ, వైసీపీ మధ్య పొలిటికల్ వార్ సాగుతోంది.



కార్పొరేషన్‌పై టీడీపీ కన్ను

కడప, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): కడప ఎమ్మెల్యే ఆర్.మాధవి కార్పొరేషన్ సర్వసభ్య సమావేశానికి తొలిసారిగా వెళ్లినపుడు కార్పొరేటర్లు ఘనస్వాగతం పలికారు. ఆమెకు డయాస్‌పై మేయర్ స్థానం పక్కనే కుర్చీ వేశారు. ఆ తర్వాత చోటుచేసుకున్న రాజకీయ పరిణామాలతో రెండో మీటింగ్‌కు డయాస్‌పై మేయర్ కుర్చీ మాత్రమే ఉండేలా చూశారు. కార్పొరేషన్ ఏర్పడినప్పటి నుంచి మేయర్ పక్కన ఎమ్మెల్యేలకు కుర్చీలు వేశారు. ఇప్పుడెందుకు తీసేశారంటూ కార్పొరేషన్ సర్వసభ్య సమావేశంలో ఎమ్మెల్యే మాధవి ఆగ్రహం వ్యక్తం చేశారు. నిబంధనల మేరకు డయాస్‌పై మేయర్‌కు మాత్రమే కుర్చీ ఏర్పాటుచేశామని అప్పట్లో వైసీపీ వారు చెప్పుకొచ్చారు. అయితే మేయర్ కుర్చీ పక్కన తనకు కుర్చీ లేకపోయేసరికి ఎమ్మెల్యే జీర్ణించుకోలేకపోయారు. దీంతో వైసీపీ వారికి మేయర్ సీటే లేకుండా చేస్తానని ఆమె శపథం పూనారంటారు. ఇప్పుడు మేయర్ పీఠాన్ని కదిలించేందుకు పక్కా ప్లాన్‌తో ముందుకెళ్తున్నారు. కార్పొరేషన్‌లో టీడీపీకి ఒకే ఒక కార్పొరేటర్ ఉండగా ఇటీవల ఒకరు చేరారు. కార్పొరేషన్ పీఠం టీడీపీ పరం చేసేందుకు మేయర్‌పై అవిశ్వాస తీర్మానాన్ని ఉపయోగించాలని నిర్ణయించినట్లు చెబుతున్నారు. వైసీపీకి చెందిన 8 మంది కార్పొరేటర్లు టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు, జిల్లా అధ్యక్షుడు ఆర్.శ్రీనివాసరెడ్డి, ఎమ్మెల్యే మాధవి ఆధ్వర్యంలో సోమవారం ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు సమక్షంలో టీడీపీలో చేరనున్నారు. వీరిలో మేయర్ సురేశ్‌బాబు, డిప్యూటీ సీఎం అంజద్‌బాషా అనుచరులు ఉన్నట్లు చెబుతున్నారు. కార్పొరేటర్లు ఫ్యాన్‌కు బైబై చెప్పి సైకిలు ఎక్కనుండటం ఒక్కసారిగా కడప పాలిటిక్స్ హీటుపెంచింది. ఇంకా రెండో విడతలో మరో 11 మంది కార్పొరేటర్లు సైకిలెక్కేందుకు సిద్ధంగా ఉన్నారని టీడీపీ వర్గాలు చెబుతున్నాయి.

అంత ఈజీ కాదు

కార్పొరేషన్‌లో మొత్తం 50మంది కార్పొరేటర్లు ఉన్నారు. వీరిలో పద్మావతి, ఆనంద్ అనారోగ్యంతో మృతి చెందారు. ప్రస్తుతం 48 మంది కార్పొరేటర్లు ఉన్నారు. ప్రస్తుతం ఉన్న మేయర్‌పై అవిశ్వాస తీర్మానం పెట్టాలంటే నాలుగేళ్లు పూర్తికావాల్సి ఉంది. ఇంకా పాలకవర్గానికి 19నెలలు ఉంది. నాలుగేళ్ల గడువును రెండున్నర సంవత్సరాలకే కుదించాలనే ఆలోచనలో కూటమి ప్రభుత్వం ఉంది. ఈ మేరకు ఫైల్ కూడా సిద్ధమవుతున్నట్లు టీడీపీ వర్గాలు చెబుతున్నాయి. ప్రత్యేక జీవో వస్తే మేయర్‌పై అవిశ్వాస తీర్మానం వెంటనే పెట్టవచ్చు. అవిశ్వాసం పెడితే 48 మంది సభ్యుల్లో 25 మంది వ్యతిరేకంగా ఓటు వేస్తే సరిపోతుంది. అయితే ఎమ్మెల్సీలు, ఎంపీల ఓట్లు కూడా ఉన్నాయి. వీటిని పరిగణనలోకి తీసుకుంటే ఈ ఓట్లు ఇంకా పెరగాల్సి ఉంది.

ప్రస్తుతం టీడీపీకి ఇద్దరు ఎమ్మెల్యేలు ఉన్నారు. అలాగే ఎమ్మెల్సీలు రామగోపాల్‌రెడ్డి, సి.రామచంద్రయ్య ఉన్నారు. ఎక్స్ అఫిషియో సభ్యులుగా వీరు ఓటు హక్కు వినియోగించుకుంటారు. అంటే ప్రస్తుతం టీడీపీ సంఖ్యాబలం ఇద్దరు కార్పొరేటర్లతో కలుపుకుని 6. కాగా.. వైసీపీకి ఎమ్మెల్సీలు రామచంద్రారెడ్డి, రామసుబ్బారెడ్డి, రమేశ్‌యాదవ్, జకియా ఖానం, ఎంపీ అవినాశ్‌రెడ్డి ఉన్నారు. అంటే కార్పొరేటర్లతో కలిపి వైసీపీ బలం 51. వీరిలో ఇటీవల జకియా ఖానం నారా లోకేశ్‌ను కలిశారు. ఈ నేపథ్యంలో ఈమె టీడీపీకి మద్దతు తెలిపినా వైసీపీ బలం 50. అంటే.. ప్రస్తుతం కడప మేయర్ స్థానం టీడీపీకి దక్కాలంటే 26 మంది కార్పొరేటర్లు ఇటు జంప్ కావాలి. సోమవారం టీడీపీలో చేరుతున్న వారితో కలిపి పది మంది అవుతారు. మరో 11 మందిని రెండో విడతలో చేర్చుకోనున్నారు. మొత్తం 21 మంది అవుతారు. మ్యాజిక్ ఫిగర్‌కు ఇంకో ఐదుగురు అవసరం. అంతమందిని వైసీపీ నుంచి టీడీపీలోకి లాక్కునే సమయానికి పుణ్యకాలం కాస్త పూర్తవుతుందనే వాదనా వినిపిస్తోంది.

కాగా.. కొందరు కార్పొరేటర్లు సొంత వ్యాపారాలతో మేయర్ సురేశ్‌బాబు, అంజాద్‌బాషాలపై వ్యతిరేకతతో ఉండడంతో వెంటనే సైకిలెక్కేందుకు మార్గం సుగమమవుతుందని టీడీపీ వర్గాలు భావిస్తున్నాయి. నాకు కుర్చీ లేకుండా చేస్తావా, నీకే కుర్చీ లేకుండా చేస్తా.. అనే విధంగా ఎమ్మెల్యే ఆర్.మాధవి అడుగులు వేస్తుండడం చర్చనీయాంశంగా మారింది. రాష్ట్ర ప్రభుత్వం మరో నాలుగున్నర సంవత్సరాలు ఉంటుంది. జీఓ వచ్చి అవిశ్వాస తీర్మానం పెట్టి కడప కార్పొరేషన్ టీడీపీ వశం అయితే.. సొంత జిల్లాలో జగన్‌కు భారీ దెబ్బతగిలినట్టే. అయితే.. సాగునీటి సంఘాలను ఏకగ్రీవం చేసుకున్నంత ఈజీ కాదు కడప మేయర్ స్థానం సాధించడం అని రాజకీయ వర్గాల్లో చర్చ నడుస్తోంది. మాజీ సీఎం జగన్ సొంత జిల్లా కావడం.. కడప కార్పొరేషన్ ఏర్పడినప్పటి వారి కనుసన్నల్లో నడుస్తుండటంతో దీనిని ఎట్టి పరిస్థితుల్లోనూ వైసీపీ కోల్పోదని కొందరు అంచనా వేస్తున్నారు. ఏమవుతుందో మరికొద్ది రోజుల్లో తేలనుంది.

వైసీపీలో కొరవడిన సఖ్యత

● ఎవరు ఏమి మాట్లాడుతున్నారో గందరగోళం ● ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి


విలేకరుల సమావేశంలో ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి

కడప మారుతీనగర్, డిశంబరు 15(ఆంధ్రజ్యోతి): ఇటీవల జరిగిన సాధారణ ఎన్నికలలో వైసీపీ ఘోర పరాజయంతో ఆ పార్టీ నాయకులలో సఖ్యత కొరవడిందని.. ఉన్న నాయకులలో ఎవరు ఏమి మాట్లాడుతున్నారో వారికే తెలియక గందరగోళానికి గురవుతున్నారని జమ్మలమడుగు ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ ఆదినారాయణరెడ్డి అన్నారు. ఆదివారం కడప ఆర్అండ్‌బి గెస్ట్ హౌస్‌లో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈనెల 14న జరిగిన సాగునీటి సంఘాల ఎన్నికల్లో కూటమి అభ్యర్థులు విజయం సాధించిన సంగతి తెలిసిందే అన్నారు. ఎన్నికలను ఎదుర్కోలేక తాడేపల్లి కింగ్, మాజీ సీఎం జగన్‌రెడ్డి బాయ్‌కాట్ చేశామని చెప్పగా.. కడప కింగ్, ఎంపీ అవినాశ్‌రెడ్డి జిల్లాలో వీఆర్వోలను నిర్బంధించి ఏకపక్షంగా అక్రమాలకు పాల్పడ్డారని ఆరోపించడం హాస్యాస్పదంగా ఉందన్నారు. సాగునీటి ఎన్నికల్లో కనీసం పోటీ చేయకుండా జిల్లాలోని దేవగుడి, వేముల తదితర ప్రాంతాలలో అక్రమాలు జరిగాయని ఆరోపించడం వైసీపీ నేతలకు తగదన్నారు. వైసీపీ ఐదేళ్ల పాలనలో రైతులను అన్ని రకాలుగా ఇబ్బందుల పాలు చేసింది మరచిపోయి కూటమి ప్రభుత్వ పాలనలో రైతులకు తీవ్ర అన్యాయం జరుగుతోందని వైసీపీ నాయకులు రోడ్డుమీదకు వచ్చి మద్దతంటూ డ్రామాలాడడం విడ్డూరంగా ఉందన్నారు. రానున్న ఉగాది నాటికి సూపర్‌సిక్స్ పథకాలను ప్రజలందరికీ అందేలా కూటమి సర్కార్ ముందుకుసాగుతోందన్నారు.

మూడు నెలల్లో తారురోడ్డు పూర్తి

● నీటిపారుదల శాఖ ఎస్ఈ డి.వెంకటరామయ్య



పటాపట్

కడప, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): "బుగ్గవంక పనులు త్వరితగతిన పూర్తిచేస్తాం. వర్షాల కారణంగా పనులు ఆలస్యమయ్యాయి. ఇంక వెంటనే పనులు మొదలుపెడతాం. మిగిలిన పనులు కూడా త్వరలో పూర్తిచేస్తాం" అని నీటిపాదారుల శాఖ ఎస్ఈ డి.వెంకటరామయ్య ఆంధ్రజ్యోతి ఫటాఫట్ ఇంటర్వ్యూలో వెల్లడించారు.

ప్రశ్న: బుగ్గవంక పనులు ఎప్పటిలోగా పూర్తిచేస్తారు

జవాబు: బుగ్గవంక పనులు మూడు నెలల్లో పూర్తిచేస్తాం. ఎర్రముక్కపల్లె నుంచి ఇరువైపుల 8 కిలోమీటర్ల మేర 40అడుగుల వెడల్పుతో తారురోడ్డు వేస్తున్నాం. ఇప్పటికే రోడ్డు ఫార్మేషన్ పూర్తయింది. వర్షాలు పడడంతో తారు వేసేందుకు వీలుపడలేదు. మూడు నెలల్లో తారురోడ్డు పూర్తిచేస్తాం. ఇది పూర్తయితే జిల్లా పరిషత్ నుంచి నేరుగా అల్మాస్‌పేట వరకు పూర్తిగా ట్రాఫిక్ తగ్గిపోతుంది.

ప్రశ్న: పెండింగ్ పనులు ఎన్ని, ఇంకా ఎంత నిధులు అవసరం

జవాబు: ఇరువైపుల కాంపౌండ్‌వాల్ పూర్తయింది. ఇంకా రూ.11కోట్ల నిధులు అవసరం. 600 మీటర్ల మేర ఎలక్ట్రిక్ స్తంభాలను షిఫ్టింగ్ చేయాలి. ఇందుకు గాను రూ.1.25కోట్లు ట్రాన్స్‌కోకు చెల్లించనున్నాం.

ప్రశ్న: లైట్లు ఎప్పుడేస్తారు

జవాబు: సుందరీకరణలో భాగంగా రోడ్డులో సెంట్రల్ లైటింగ్‌ను కార్పొరేషన్ ఏర్పాటు చేయనుంది.

ప్రశ్న: చెరువుల సుందరీకరణ ఎంతవరకు వచ్చింది

జవాబు: ఉక్కాయపల్లె, రామనపల్లె, బుడ్డాయపల్లె చెరువులను సుందరీకరణలో భాగంగా అభివృద్ధి చేస్తున్నాం. రూ.5.50 కోట్లు ఖర్చుచేశాం. రహదారుల నిర్మాణం పూర్తయితే రాజంపేట బైపాస్ సర్కిల్‌లోని రిమ్స్ పోలీస్‌స్టేషన్ నుంచి నేరుగా రిమ్స్‌దారిలో కలవచ్చు. ట్రాఫిక్ తగ్గుతుంది. చెరువుల సుందరీకరణ పనులు అమృత్ నిధులతో చేపడుతున్నాం. చెరువులో బోటింగ్, వాకింగ్ ట్రాక్, ఇతర సౌకర్యాలను కార్పొరేషన్ సాయంతో అభివృద్ధి చేస్తాం.



జాతీయ లోక్ అదాలత్‌లో జిల్లాకు 7వ ర్యాంకు

● 7538 కేసులు పరిష్కారం
● రూ.30.62 కోట్ల చెల్లింపు
● జిల్లా ప్రధాన జడ్జి గల్లా శ్రీదేవి

7

ఉమెన్ ప్రీమియం క్రికెట్ లీగ్‌కు శ్రీచరణి ఎంపిక

జన్ ఔషధీలో.. చౌక ధరలకే మందులు

● డీసీఎంఎస్ ఆధ్వర్యంలో నిర్వహణ
● ప్రజల్లో అపోహలు తొలగించేందుకు కసరత్తు
7
● వినియోగదారులను ఆకర్షించేందుకు యత్నం



ఎన్నికల్లో దౌర్జన్యం చేశామనడం హాస్యాస్పదం

● పులివెందుల టీడీపీ ఇన్‌చార్జి బీటెక్ రవి

వేంపల్లె, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): పులివెందుల నియోజకవర్గంలో టీడీపీ దౌర్జన్యం చేసి ఏకగ్రీవంగా సాగునీటి సంఘం ఎన్నికలు జరుపుకున్నారని ఎంపీ అవినాశ్‌రెడ్డి చెప్పడం హాస్యాస్పదమని పులివెందుల టీడీపీ ఇన్‌చార్జి బీటెక్ రవి అన్నారు. ఎన్నికల్లో పాల్గొనేందుకు నోడ్యూస్ సర్టిఫికెట్ తీసుకునేందుకు వైసీపీ వారు ఒక్కరు కూడా తహశీల్దార్ కార్యాలయానికి రాలేదని, ఎన్నికల్లో పోటీచేసే దమ్ములేకే నంగనాచి మాటలు మాట్లాడుతున్నారని విమర్శించారు. వేంపల్లె ఆర్‌అండ్‌బి అతిథి భవనంలో ఆయన ఆదివారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. తహశీల్దార్ కార్యాలయాల్లో వీఆర్వోలను బంధించారని అవినాశ్ చెప్పడంలో వాస్తవం లేదన్నారు. వారి ఆఫీసుల్లో వారు పనిచేసుకోవడం బంధించడం ఎలా అవుతుందన్నారు. మొదటి నుంచి వైఎస్ కుటుంబం దౌర్జన్యంతోనే గెలుస్తున్నారన్నారు. వైఎస్ కుటుంబాన్ని ఓడించే సత్తా బీటెక్ రవికే ఉంద న్నారు. గతంలో వైఎస్ వివేకానందరెడ్డిని ఓడించడం, ఇపుడు సాగునీటి సంఘాల ఎన్నికల్లో పూర్తిస్థానాలను కైవశం చేసుకోవడం భవిష్యత్తులో కూడా స్థానిక సంస్థల ఎన్నికల్లో ఇదేవిధానాన్ని పాటిస్తామని స్పష్టం చేశారు. మండల పరిశీలకుడు రఘునాథరెడ్డి, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.


వేంపల్లె ఆర్అండ్‌బి అతిథి గృహంలో మాట్లాడుతున్న బీటెక్ రవి

రాజ్యాంగ పరిరక్షణ.. దేశ సమైక్యతే ధ్యేయం

● సవరణ బిల్లుకు పూర్తి వ్యతిరేకం
● జమ్ ఇయ్యత్ ఉలమాయే హింద్ జాతీయ అధ్యక్షుడు



సభనుద్దేశించి మాట్లాడుతున్న మదనిసాహెబ్



కడప కల్చరల్, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): రాజ్యాంగ పరిరక్షణ, దేశ సమైక్యతే అంతిమ ధ్యేయమని జమ్ ఇయ్యత్ ఉలమాయె హింద్ జాతీయ అధ్యక్షుడు మౌలానా సయ్యద్ అర్షద్ మదని సాహెబ్ పేర్కొన్నారు. జమ్ ఇయ్యత్ ఉలమాయె హింద్ ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక జయరాజ్ గార్డెన్స్ సమీపంలో రాజ్యాంగ పరిరక్షణ- జాతీయ సమైక్యతా సమావేశం నిర్వహించారు. ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. భారతదేశం సర్వమతాలకు నిలయమని, అన్ని వర్గాలకు సమాన స్వేచ్ఛ కల్పించాల్సిన బాధ్యత పాలక ప్రభుత్వాలపై ఉందన్నారు. ముస్లింల ధార్మిక, సామాజిక, విద్య, శిక్షణ కోసం తమ హింద్ కృషి చేస్తున్నదన్నారు. ఇదిలావుండగా ముస్లిం సవరణ బిల్లును పూర్తిగా వ్యతిరేకిస్తున్నట్లు స్పష్టంచేశారు. ఈ బోర్డు ఇప్పటిది కాదని కొన్ని సంవత్సరాల క్రితం నుంచి ఉందన్నారు. నాటి రికార్డులను ఎక్కడ నుంచి తేవాలన్నారు. బోర్డుకు సంబంధించిన ఆస్తులను స్వాధీనం చేసుకోడానికి కేంద్రంలో పాలన సాగిస్తున్న బీజేపీ ప్రభుత్వం ఈ సవరణ బిల్లును తెరపైకి తీసుకొచ్చిందన్నారు. బోర్డులో ఇదివరకు 11 మంది సభ్యులుండగా వారందరినీ ముస్లిం వర్గానికి చెందిన వారినే ఎన్నుకునేవారన్నారు. ప్రస్తుత సవరణ బిల్లులో నలుగురు ముస్లింలు మాత్రమే సభ్యులుగా ఉండేందుకు వీలవుతుందన్నారు. ప్రస్తుత ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆ బిల్లును వ్యతిరేకించాలని కోరారు. ముఖ్యంగా ఆ బిల్లుతో బోర్డు ఆస్తులను కోల్పోవాల్సిఉంటుందన్నారు. దీనిని ప్రతి ఒక్కరూ వ్యతిరేకించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో టీడీపీ మదనపల్లె ఎమ్మెల్యే షాజహాన్, ఎంఎల్‌సీ ఫారూఖ్, నేతలు అమీర్‌బాబు, సలావుద్దీన్, మాజీ డిప్యూటీ సీఎం అంజద్‌బాషాతోపాటు వేలాదిగా ముస్లింలు పాల్గొన్నారు.



జన్ ఔషధి మందుల షాపు

జన్ ఔషధిలో... చౌక ధరలకే మందులు

- డీసీఎంఎస్ ఆధ్వర్యంలో నిర్వహణ
- ప్రజల్లో అపోహలు తొలగించేందుకు కసరత్తు
- వినియోగదారులను ఆకర్షించేందుకు యత్నం

కడప ఎన్టీఆర్ సర్కిల్, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): తక్కువ ధరలకే ఔషధాలు అందించేందుకు అధికార యంత్రాంగం చర్యలు తీసుకుంటోంది. ప్రస్తుత కాలంలో ఎక్కువ శాతం మంది ఏదోక జబ్బుతో బాధపడుతూ మందులు వాడాల్సిన పరిస్థితి. దీంతో మందుల ధరలు ఆకాశాన్ని అంటుతున్నాయి. ప్రతి ఒక్కరి సంపాదనలో అధికభాగం మెరుగైన ఆరోగ్యం కోసం ఖర్చు చేయాల్సి వస్తుంది. దీంతో సామాన్యుల, పేదల పరిస్థితి దారుణంగా తయారవుతోంది. ఆసుపత్రికి వెళ్లాలంటే అప్పు చేయాల్సిన పరిస్థితి. ఈక్రమంలో ప్రభుత్వాలు ఔషధాల ధరలను తగ్గించి కొంతవరకైనా వెసులుబాటు కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నాయి. ఇందులో భాగంగానే జనరిక్ ఔషధ కేంద్రాలను గత కొన్ని సంవత్సరాలుగా నిర్వహిస్తున్నారు. అయితే వీటికి తగినంత ఆదరణ లేకపోవడంతో కొంతకాలానికి మూతపడాల్సిన పరిస్థితి నెలకొంది. అయినప్పటికి జిల్లాలో జనరిక్ మందుల షాపుల కేంద్రాలు నడుస్తున్నాయి. ప్రస్తుత ప్రభుత్వాలు జనరిక్ మం దుల షాపుల కేంద్రాలను ప్రోత్సహిస్తున్నాయి. జన్ ఔషధీ పేరుతో కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నాయి. ఈ షాపుల ద్వారా దాదాపు 70 నుంచి 80శాతం వరకు కొనుగోలు చేసే మందులపై రాయితీ లస్తుంది.

డీసీఎంఎస్ ఆధ్వర్యంలో

వ్యవసాయంలో రైతులు సాగుచేస్తున్న పంటలను ఆశించే చీడ,పీడ పురుగుల నివారణకు మందులను అందించే ఉద్దేశ్యంతో ఏర్పాటైన జిల్లా సహకార మార్కెటింగ్ సొసైటీ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలో జన ఔషధ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ఇంతకుముందే రైతులకు సేవలు అందిస్తున్న సహకార మార్కెటింగ్ సొసైటీతో పాటు సహకార సొసైటీ ఆధ్వర్యంలో జన్ ఔషధీ కేంద్రాల ఏర్పాటుకు సహకార శాఖ చర్యలు తీసుకుంది. అయితే పెండ్లిమర్రి మండలంలోని వెల్లటూరులో గత కొంతకాలం క్రితం ఏర్పాటు చేసిన జన్ ఔషధీ కేంద్రం నష్టాల్లో నడుస్తుండడంతో మూత వేశారు. దీంతో గత ఏడాది జూలైలో ఏర్పాటు చేయాల్సిన జన్ఔషధీ కేంద్రాన్ని డీసీఎంఎస్ తాత్కాలికంగా వాయిదా వేస్తూ వచ్చింది. ఇప్పటి వరకు రైతులకు అవసరమైన ఎరువులు, పురుగుమందులు, విత్తనాలు అందిస్తూ వస్తున్న డీసీఎంఎస్ గత వైసీపీ ప్రభుత్వ హయాంలో ఏర్పాటైన రైతు భరోసా కేంద్రాల వల్ల వ్యాపారాలు లేకుండా పోయాయి. ప్రభుత్వం తీసుకుంటున్న నిర్ణయం వల్ల తమకు వ్యాపారం వస్తుందని ఆశించిన డీసీఎంఎస్ సంస్థకు కొంతకాలం నిరాశమిగిలింది. ఎట్టకేలకు గత నెలలో డీసీఎంఎస్ ఆధ్వర్యంలో జన్ ఔషధీ కేంద్రం ప్రారంభానికి నోచుకుంది. ఈ క్రమంలో తమ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న జన్ఔషధీ కేంద్రాన్ని బలోపేతం చేసేందుకు డీసీఎంఎస్ అధికార యంత్రాంగా ఆలోచనలు చేస్తోంది. రాబోవు రోజుల్లో జన్ ఔషధీ కేంద్రాల్లో లభించే మందులు సాధారణంగా బయట లభించే మందులతో సమానమేనని... తగినంత ప్రచారం చేపట్టి ముందుకు సాగేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నారు.

అవగాహన లేకపోవడమే.

జనరిక్ షాపుల్లో లభించే మందులపై ప్రజల్లో సరైన అవగాహన లేకపోవడంతోనే వాటి మనుగడ ప్రశ్నార్థకంగా మారుతోంది. 2012లోనే ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో అన్న సంజీవిని పేరుతో జనరిక్ మందుల దుకాణాలు ఏర్పాటయ్యాయి. జిల్లాలో 18షాపులను ప్రభుత్వం ఏర్పాటు చేసింది. వీటి నిర్వహణ బాధ్యతలను మహిళా సమైఖ్యలకు అప్పగించడం జరిగింది. వాటిని వెలుగు సిబ్బంది పర్యవేక్షించేవారు. కాలక్రమంలో తగిన ఆదరణ లేకపోవడంతో నష్టాలు రావడం మొదలైంది. దీంతో కొంతకాలానికి వీటిని మూసివేశారు. అయినప్పటికి కొన్నిచోట్ల మహిళా సంఘాల ప్రతినిధులు ఈ షాపులను స్వాధీనం చేసుకొని సొంతంగా నిర్వహిస్తున్నారు. జనరిక్‌పై ప్రజల్లో అవగాహన లేకపోవడం... డాక్టర్లు కూడా ఆ మందులను చీటీలలో రాయకపోవడంతో జనరిక్ కేంద్రాలకు ఆదరణ తగ్గింది. వాస్తవానికి జనరిక్ షాపుల్లో లభించే మందులు నాణ్యమైనవే. గతంలో ఒక కంపెనీ తాము తయారు చేసే మందులపై పూర్తి హక్కు కలిగి ఉంటుంది. ఈ హక్కుకు కొంత గడువు ఉంటుంది. ఆ గడువు ముగిసిన తర్వాత అదే మందును తక్కువ ధరకు విక్రయించే అవకాశం ఉంటుంది. దీంతో జనరిక్ షాపుల్లో తక్కువ ధరకే మందులు లభిస్తున్నాయి. బయట ప్రముఖ కంపెనీలు తయారు చేసే మందులు ధరలతో పోలిస్తే ఈ మందుల ధర తక్కువగా ఉండడంతో నాణ్యత



జన్ ఔషధీ కేంద్రంలో ఫార్మాసిస్ట్

ఉండకపోవచ్చు అనే అపోహ, అనుమానం ప్రజల్లో వ్యక్తమవుతోంది. ఈ కారణం చేతనే జనరిక్ షాపుల్లో లభించే మందులు కొనుగోళ్లకు వినియోగదారులు వెనకడుగు వేస్తున్నారు. ఈక్రమంలో ప్రభుత్వాలు ప్రజల్లో అవగాహన తీసుకొచ్చేందుకు ప్రత్యేక కార్యక్రమాల ద్వారా చర్యలు తీసుకుంటే తప్ప జనరిక్ మందుల షాపుల నిర్వహణ కొనసాగే పరిస్థితి కనిపించడం లేదు.

వినియోగదారులను ఆకర్షించే ప్రయత్నం

జనరిక్ ఔషధీ కేంద్రంలో వ్యాపారం మొదలైంది. జనరిక మందులపై ప్రజల్లో అవగాహన తీసుకువచ్చి వారిని ఆకర్షించే ప్రయత్నం చేస్తున్నాం. మరిన్ని రకాలైన బ్రాండ్లు తెప్పించి ప్రజలకు అందుబాటులో ఉంచుతున్నాం. పరిచయమున్న వైద్యుల సహకారంతో వినియోగదారుల సంఖ్యను పెంచడం కోసం ప్రయత్నం చేస్తున్నాం.

-ఖాదర్‌వల్లి, ఇన్‌చార్జి బిజినెస్ మేనేజర్, డీసీఎంఎస్.

పులిపిరికి అరుదైన చికిత్స

▸▸ ఆకుపసరుతో నిమిషాల్లో తొలగింపు



పులిపిర్లపై చికిత్స చేస్తున్న దృశ్యం

కడప జిల్లా : డిసెంబర్ 15: పులిపిర్లకు వడియార మల్లికార్జున అరుదైన చికిత్స నందిస్తున్నారు. ఆకుపసరుతో నిమిషాల్లో శరీరంపై ఉన్న పులిపిర్లు తొలగిస్తామంటున్నారు. కడప జిల్లా, కొత్త బస్‌స్టాండ్ ప్రక్కన ఎస్.పి.బంగ్లా ఎదురుగా, హరిత హోటల్, ఎపి టూరిజం కడప నందు ఆయన పులిపిర్లకు చికిత్స అందిస్తున్నారు. ఈ నెల 15, 16, 17 తేదీల్లో మూడు రోజుల పాటు వాటికి చికిత్స అందిస్తున్నట్లు ఆయన తెలిపారు. ఇందులో భాగంగా ఆదివారం పలువురికి పులిపిర్లు తొలగించారు. సాధారణంగా మనిషిలో 7 రకాలుగా ఈ పులిపిర్లు కనిపిస్తాయన్నారు. ఏ రకమైన పులిపిరినైనా సరే తాము సేకరించిన పొడిని తడిపిన దూదితో పులిపిరిపై అద్ది తక్షణమే తొలగిస్తామన్నారు. అనంతరం అదే పొడి మళ్లీ పులిపిరి తొలగించిన ప్రదేశంలో అద్దుతామన్నారు. సోమ, మంగళవారం రెండు రోజుల్లో మాత్రమే వైద్యం అందుబాటులో ఉంటుందని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. 9849628485 నెంబర్లులోని సంప్రదించాలన్నారు.

జాతీయ లోక్ అదాలత్‌లో ఉమ్మడి జిల్లాకు 7వ ర్యాంకు

- 7538 కేసులు పరిష్కారం
- రూ.30,62,35,148లు చెల్లింపు
- జిల్లా ప్రధాన జడ్జి గల్లా శ్రీదేవి

కడప రూరల్, డిసెంబర్ 15 (ఆంధ్రజ్యోతి): జాతీయ, రాష్ట్ర న్యాయసేవాధికార సంస్థల ఆదేశాల మేరకు ఈనెల 14న శనివారం రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహించిన జాతీయ లోక్ అదాలత్‌లో కడప జిల్లాకు 7వ ర్యాంకు దక్కిందని డీఎల్ఎస్ఏ చైర్మన్, జిల్లా ప్రధాన జడ్జి గల్లా శ్రీదేవి తెలిపారు. ఉమ్మడి కడప జిల్లా వ్యాప్తంగా ఆయా కోర్టులలో 22 బెంచ్‌లను ఏర్పాటు చేసి మొత్తం 7538 కేసులు పరిష్కరించామన్నారు. ఇందులో 7104 క్రిమినల్ కేసులు, 262 సివిల్ కేసులు, 172 ప్రీలిటిగేషన్ కేసులను పరిష్కరించినట్లు తెలిపారు. వీటిలో కడపలో 2689 కేసులు, ప్రొద్దుటూరులో 1839, రాజంపేటలో 512, రాయచోటిలో 130, బద్వేల్‌లో 253, జమ్మలమడుగులో 1058, సిద్దవటంలో 100, రైల్వేకోడూరులో 185, పులివెందులలో 320, నందలూరులో 211, లక్కిరెడ్డిపల్లెలో 83, కమలాపురంలో 158 కేసులు పరిష్కరించినట్లు తెలిపారు. మొత్తం కేసుల పరిష్కారానికి కక్షిదారులకు రూ. 30,62,35,148లు చెల్లింపులు జరిగాయన్నారు. జాతీయ లోక్ అదాలత్‌లో కేసుల పరిష్కారానికి తోడ్పడిన న్యాయవాదులకు, రెవెన్యూ సిబ్బందికి, పోలీస్ అధికారులకు, ఇన్సూరెన్స్, బ్యాంకు అధికారులు తదితరులకు కృజ్ఞతలు తెలియజేశారు.

ఉమెన్ ప్రీమియం క్రికెట్ లీగ్‌కు శ్రీ చరణి ఎంపిక



కడప స్పోర్ట్స్, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): ఉమెన్ ప్రీమియం క్రికెట్ లీగ్‌కు కడపకు చెందిన క్రీడాకారిణి ఎస్.శ్రీచరణి (రూ.55 లక్షలకు) ఢిల్లీ క్యాపిటల్స్ జట్టుకు ఎంపికయ్యారు. దీంతో జిల్లా క్రికెట్ సంఘం అధ్యక్ష, కార్యదర్శులు ఎం. భరత్‌రెడ్డి, అవ్వారు రెడ్డి ప్రసాద్ హర్షం వ్యక్తం చేస్తూ ప్రత్యేక అభినందనలు తెలిపారు. ప్రీమియర్ విభాగ పోటీలలో రాణించి తద్వారా జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని ఆశాభావం వ్యక్తం చేశారు.

జనసంద్రమైన జ్యోతి క్షేత్రం

- ముగిసిన కాశినాయన ఆరాధనోత్సవాలు
- జ్యోతి దర్శనంతో పులకించిన భక్తులు
- కన్నుల పండువగా సాగిన రథోత్సవం



కాశినాయన రథోత్సవంలో పాల్గొన్న భక్తులు



భక్తులకు దర్శనమిచ్చిన కాశినాయన జ్యోతి వెలుగు

కాశినాయన డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): నల్లమల అటవీ ప్రాంతంలోని జ్యోతి క్షేత్రం జనసంద్రమైంది. శనివారం అర్ధరాత్రి నిండైన జ్యోతి దర్శనంతో కాశినాయన భక్తులు ఆనందపరవశులయ్యారు. అనంతరం రథోత్సవం వైభవంగా సాగింది. వివరాలిలా.. జ్యోతి క్షేత్రంలో శనివారం కాశినాయన ఆరాధనోత్సవాలు ప్రారంభం కాగా.. ఆదివారం ప్రత్యేక పూజలు, హోమాలు, సాంస్కృతిక కార్యక్రమాలతో జ్యోతి క్షేత్రం హోరెత్తింది. దట్టమైన అటవీప్రాతంలో వణికిస్తున్న చలిని సైతం లెక్క చేయకుండా భక్తులు శనివారం అర్ధరాత్రి జ్యోతి దర్శనం చేసుకున్నారు. ఆ తర్వాత కన్నుల పండువగా సాగిన కాశినాయన రథోత్సవంలో పెద్ద ఎత్తున భక్తులు పాల్గొన్నారు. రెండు రోజుల ఆరాధనలో దాదాపు లక్షమంది భక్త లు పాల్గొన్నట్లు నిర్వాహకులు తెలిపారు. గతంలో నిర్వహించిన ఆరా ధనల కంటే ఈఆరాధనకు భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చినట్లు చెబు తున్నారు. రెండు రోజులూ నిరంతరాయంగా భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు. ఆరాధనకు వచ్చిన భక్తులే అన్నింటతామై కార్యక్రమా న్ని జయప్రదం చేశారు. ఆరాధనలో పాల్గొన్న భక్తులు భారీగా బియ్యం, సరుకులు అందజేశారు. ఆలయ నిర్వాహకులు, పోలీసులు, ఆర్టీసీ అధికారులు, హెల్త్ డిపార్ట్‌మెంట్ సమన్వయంతో విస్తృత ఏర్పాట్లు చేయడంతో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఆరాధనోత్సవాలు ప్రశాంతంగా ముగిశాయి.

లింగాలలో...: స్థానిక వనంబావి శివాలయంలో ఆదివారం కాశినాయన ఆరాధన మహోత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలలో టీడీపీ పులివెందుల ఇన్‌చార్జి బీటెక్ రవి పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. రూ.50వేలు నగదు వితరణగా అందించారు. ఈ సందర్భంగా మహిళలు నిర్వహించిన కోలాటం, భజన కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. అనంతరం బండలాగుడు పోటీలను సారెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి ప్రారంభించి.. ప్రథమ స్థానంలో నిలిచిన ఎడ్ల యజ మానికి రూ.70వేల నగదు బహుమతి అందించారు. రెండు, మూడు, నాలుగు స్థానాల్లో నిలిచిన వారికి రూ.50వేలు,రూ.40వేలు, రూ.30వేలు నగదు బహుమతులను అందజేశారు.

ఖాజీపేటలో...: కడప- కర్నూలు జాతీయ రహదారిలోని పత్తూరు వద్ద గల శ్రీకాశిరెడ్డినాయన 28వ ఆరాధనోత్సవాలు ముగిశాయి. ఉదయం స్వామివారికి మహానైవేద్యం సమర్పించారు. పది గంటల నుంచి తాళం భజన ప్రారంభించారు. ఈ భజనలో 20 గ్రామాల భజన బృందాలు పాల్గొన్నాయి. గెలుపొందినవారికి బహుమతులు అందజేశారు.

16 నుంచి తైక్వాండో శిక్షణ తరగతులు

కడప ఎడ్యుకేషన్, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): యోగివేమన విశ్వవిద్యాలయ వసతి గృహాల్లో ఉంటున్న విద్యార్థినులకు ఈనెల 16 నుంచి 21వ తేదీ వరకు క్యాంపస్‌లో తైక్వాండో శిక్షణ తరగతులు నిర్వహించనున్నట్లు పీజీ కళాశాల ప్రధానాచార్యులు, హాస్టళ్ల చీఫ్ వార్డన్ ప్రొఫెసర్ ఎస్.రఘునాథరెడ్డి తెలిపారు. ప్రతిరోజు ఉదయం, సాయంత్రం గంటన్నర పాటు నిపుణులు శిక్షణ ఇస్తారని వివరించారు. హాస్టల్స్ విద్యార్థినులు హాజరయ్యేలా చూడాలని అన్ని విభాగాల అధిపతులు, కోఆర్డినేటర్‌లకు సూచించారు.

గురుకుల పాఠశాల మరమ్మతులకు ప్రభుత్వం గ్రీన్‌సిగ్నల్

- ఎమ్మెల్యే చొరవతో రూ.62 లక్షలు మంజూరు



కొండాపురం, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): చౌటిపల్లె వద్ద ఉన్న బాలికల గురుకుల పాఠశాల మరమ్మ త్తులకు ప్రభుత్వం గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. పాఠశాలలో ఇటీవల ఇద్దరు విద్యార్థులు పాముకాటుకు గురైన సంగతి తెలిసిందే. గురుకుల పాఠశాలలో సుమా రు 600 మంది విద్యార్థులు ఇంటర్ వరకు చదువు తున్నారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో పాఠశాలలో మెయింటెనెన్స్ పనులు గాలికివది లేసింది. దీంతో పాఠశాలలో బాత్‌రూమ్‌లు, తలుపులు, కిటికీలు అధ్వానంగా తయారై. పాములు, కోతులు పాఠశాలలోకి వస్తుండడంతో విద్యార్థులు వారి తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. ఈ పరిస్థితిపై ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారు. దీంతో తక్షణం మెయింటెనెన్స్ పనులు చేపట్టడానికి రూ.62లక్షలు మంజూరయ్యాయి. త్వరలో పనులను చేపట్టనున్నట్లు మాజీ సర్పంచ్, కాంట్రాక్టర్ రామలింగేశ్వరరెడ్డి తెలిపారు.

యూసీఐఎల్ ఉద్యోగి కాలువలో పడి గల్లంతు?

- గాలింపు చర్యలు చేపట్టిన పోలీసులు

పులివెందుల టౌన్, డిసెంబర్ 15 (ఆంధ్ర జ్యోతి): యురేనియం కర్మాగారంలో పనిచేస్తున్న పాలగిరి రామాంజనేయులు (28) అనే ఉద్యోగి కాలువలో పడి గల్లంతయ్యాడు. ఆదివారం సాయంత్రం ఇంటి నుంచి బయటకు వెళ్లిన రామాంజనేయులు పులివెందుల పట్టణ పరిధిలోని నల్లపురెడ్డిపల్లి రహదారి సమీపంలో ఉన్న కాలువ గట్టున మోటార్ బైక్ దగ్గర చెప్పులు వదిలి కనిపించలేదు. స్థానికులు గమనించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. కాలువలో పడి గల్లంతు అయి ఉండవచ్చని పోలీసులు, ఫైర్ సిబ్బంది గాలింపు చర్యలు చేపట్టారు. రామాంజనేయులు యురేనియం కర్మాగారంలో ఏఎండీ ఆపరేటర్ (ఔట్ సోర్సింగ్ ఉద్యోగి)గా పని చేస్తున్నాడు. సొంత గ్రామం వేముల మండలం మబ్బు చింతలపల్లి. ప్రస్తుతం పట్టణంలోని ఎరుగుడిపల్లెలో నివాసం ఉంటున్నారు. కాలువలో పడి గల్లంతు అయ్యాడా.. ఎవరైనా ఏమైనా చేశారా అన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

శ్రీకృష్ణ దేవరాయకాలనీలో చోరీ

- 15తులాల బంగారం, రూ 4.50లక్షల నగదు, రెండు కిలోల వెండి అపహరణ



పరిశీలిస్తున్న ఎస్ఐ రాజరాజేశ్వర్ రెడ్డి

కడప(క్రైం), డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): కడప నగరంలోని శ్రీకృష్ణ దేవరాయకాలనీలోని ఓ వ్యక్తి ఇంట్లో దొంగలు పడి బంగారం, నగదు, వెండి వస్తువులను అపహరించారు. బాధితుడు రాజశేఖర్ హౌసింగ్ బోర్డు కాలనీలో ప్లే స్కూల్ నిర్వహిస్తున్నాడు. శని, ఆదివారం రెండు రోజులు సెలవులు కావడంతో సొంత ఊరు చక్రాయపేటకు కుటుంబంతో కలిసి వెళ్లారు. దొంగలు అతని ఇంటి తాళాలు పగులగొట్టి బీరువాలో ఉన్న 15 తులాల బంగారు నగలు, రెండు కిలోల వెండి సామగ్రి, రూ.4.50 లక్షల నగదును అపహరించారు. సమాచారం తెలిసిన చిన్నచౌకు సీఐ ఓబులేసు, ఎస్ఐ రాజరాజేశ్వర్‌రెడ్డి సిబ్బందితో సంఘటన స్థలానికి చేరుకున్నారు. చోరీ ఘటనను పరిశీలించి.. క్లూస్ టీంను పిలిపించి దొంగల వేలిముద్రలను సేకరించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారిస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

అపూర్వం పూర్వ విద్యార్థుల సమ్మేళనం



అపూర్వ సమ్మేళనంలో పూర్వ విద్యార్థులు

నందలూరు, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): నందలూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆదివారం హైస్కూలు, కళాశాల పూర్వ విద్యార్థుల (1983 బ్యాచ్) సమ్మేళనం ఆదివారం అపూర్వంగా జరిగింది. ఈ సందర్భంగా వివిధ ప్రాంతాలలో ఉన్న వారంతా కలిసి నాటి మధురస్మృతులను నెమరువేసుకున్నారు. ఆనందోత్సాహాలతో గడిపారు. అనంతరం అప్పటి గురువులు జీవీ కృష్ణయ్య, గానుగపెంట హనుమంతరావు, ఆకుల వెంకట సుబ్బయ్య, రామసుబ్బన్న, లక్ష్మీకాంతమ్మలను ఘనంగా సత్కరించారు. అనారోగ్యంతో బాధపడుతున్న తమ తోటి విద్యార్థి సీహెచ్ నాగేశ్వరరావుకు రూ.25వేలు, చనిపోయిన మరో విద్యార్థి సుబ్రమణ్యం కుటుంబానికి రూ.25వేలు ఆర్థిక సహాయం అందజేశారు. ఈ సమ్మేళనంలో మాజీ ఏజీపీ షేక్ మహ్మద్‌అలీ, మైనుద్దీన్, కోడూరు సుమన, సువర్ణకుమార్ తదితర పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

శిక్షణ తరగతులలో ఉత్తీర్ణత సులభతరం

కడప ఎడ్యుకేషన్, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): శిక్షణ తరగతుల ద్వారా ఉత్తీర్ణత సులభతరం అవుతుందని ఏపీ జేఏసీ జిల్లా చైర్మన్ శ్రీనివాసులు, ఏపీ ఎన్జీఓ జిల్లా కార్యదర్శి రవి కుమార్ తెలిపారు. ఆదివారం కడప ఎన్జీఓ భవన్‌లో ఏపీటీఎఫ్ అమరావతి ఆధ్వర్యంలో డిపార్ట్‌మెంటల్ పరీక్షలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన వారు మాట్లాడుతూ ఉద్యోగులు ఉపాధ్యాయులు డిపార్ట్‌మెంటల్ పరీక్షలు సులభంగా ఉత్తీర్ణత కావాలంటే శిక్షణా తరగతులలో పాల్గొనాల్సి ఉంటుందన్నారు. డిపార్ట్‌మెంటల్ పరీక్షలు ప్రశ్నాపత్రంపై అవగాహన పెంచుకోవాలని చెప్పారు. భవిష్యత్తులో ఉద్యోగులకు వృత్తినైపుణ్య సదస్సులు కూడా ఏర్పాటు చేయాలని కోరారు.


ఏపీటీఎఫ్ అమరావతి రాష్ట్ర అధ్యక్షుడు సీవీ ప్రసాద్ మాట్లాడుతూ ఉపాధ్యాయుల సంక్షేమం దృష్ట్యా చైతన్య సదస్సులను ఏర్పాటు చేస్తున్నామన్నారు. డిపార్ట్‌మెంటల్ పరీక్షలకు కావాల్సిన అభ్యసనా ప్రక్రియ గురిం చి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఏపీటీఎఫ్ అమరావతి నాయకులు చంద్రశేఖర్‌రెడ్డి, సత్యం, వీరప్రసాద్‌తో పాటు ఉద్యోగ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సాఫ్ట్‌బాల్ టెన్నిస్ రాష్ట్ర జట్టు కోచ్‌గా పోలంకి గణేశ్‌బాబు



నందలూరు, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): సాఫ్ట్‌బాల్ టెన్నిస్ ఆంధ్రప్రదేశ్ జట్టు కోచ్, మేనేజర్‌గా టంగుటూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఫిజికల్ డైరెక్టర్ పోలంకి గణేష్ బాబు నియమితులైనట్లు ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాసులు ఆదివారం తెలిపారు. మధ్యప్రదేశ్ రాష్ట్రంలోని భోపాల్ (దేవాస్)లో ఈనెల 18 నుంచి 26వ తేదీ వరకు జాతీయస్థాయి అండర్-14, అండర్-17, అండర్-19 విభాగాల్లో ఈ పోటీలు జరగనున్నాయి. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు ఆయనను అభినందించారు.

గండికోట నుంచి 100 క్యూసెక్కులు విడుదల



మెయిన్‌కెనాల్ నుంచి విడుదలవుతున్న నీరు

కొండాపురం, డిశంబరు 15 (ఆంధ్రజ్యోతి): గండికోట ప్రాజెక్టు నుంచి జీఎన్ ఎస్ఎస్ మెయిన్‌కెనాల్ ద్వారా 100 క్యూసెక్కులు వదులు తున్నట్లు ఈఈ ఉమామహేశ్వర్లు తెలిపారు. కమలాపురం రైతుల అవసరాల దృష్ట్యా ఈ నీటిని వదులుతున్నామన్నారు. కాగా ప్రస్తుతం ప్రాజెక్టులోకి ఇన్‌ఫ్లో లేదన్నారు. ప్రస్తుతం గండికోట ప్రాజెక్టులో 26.07 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు ఈఈ తెలిపారు.

ఆశాలకు ఇచ్చిన హామీలు నెరవేర్చకపోతే ఉద్యమం తప్పదు : ఏఐటీయూసీ



జనరల్ బాడీ సమావేశంలో మాట్లాడుతున్న వెంకటసుబ్బయ్య

కడప మారుతీనగర్, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): ఆశాలకిచ్చిన హామీలు నెరవేర్చకపోతే ఉద్యమం తప్పదని ఏఐటీయూసీ రాష్ట్ర నాయకుడు వెంకటసుబ్బయ్య, జిల్లా అధ్యక్షుడు గుంటి వేణుగోపాల్ హెచ్చరించారు. ఆదివారం స్థానిక ఏఐటీయూసీ జిల్లా కార్యాలయంలో ఏపీ ఆశా వర్కర్స్ యూనియన్ జిల్లా జనరల్ బాడీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తాము అధికారంలోకి వచ్చిన వెంటనే ఆశాలకు వేతనాలు పెంచుతామని, ఉద్యోగ భద్రత కల్పిస్తామని, ఆశాల సమస్యలన్నింటినీ పరిష్కరిస్తామని ప్రస్తుత ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు హామీ ఇచ్చి గద్దెనెక్కిన అనంతరం ఆ హామీలను మరిచారన్నారు. అనంతరం ఏపీ ఆశా వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు పి.సుభాషిణి, ఎల్.శాంతి మాట్లాడారు. గత 18 సంవత్సరాలుగా గర్భిణులు, బాలింతలు, నవజాత శిశువులకు సేవలందిస్తూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందిస్తున్న పలు సంక్షేమ పథకాలను, ఆరోగ్య సూత్రాలను క్షేత్రస్థాయిలో ప్రజలకు సర్వేల రూపంలో అందుబాటులోకి తెస్తున్న ఆశాలను పాలకులు నిర్లక్ష్యం చేయడం దారుణమన్నారు. పెరిగిన ధరలకు అనుగుణంగా వేతనాలు 26 వేలకు పెంచాలని, రాజకీయ నాయకుల వేధింపులు ఆపాలని, మెడికల్ ఉద్యోగులుగా గుర్తించి పర్మినెంట్ చేయాలని, తమ ఉద్యోగాలకు భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారిచే గుర్తింపు కార్డులు ఇవ్వాలని, పెండింగ్‌లో ఉన్న కరోనా, లెప్రసీ, టీబీ అలవెన్సులు ఇవ్వాలని కోరారు. ఏఎన్‌ఎం పూర్తి చేసి ఆశాలుగా సేవలందిస్తున్న వారికి ఏఎన్‌ఎంగా పదోన్నతి కల్పించాలని, రిటైర్మెంట్ బెనిఫిట్స్ రూ.5 లక్షలు, పెన్షన్ రూ.10వేలు ఇవ్వాలని, 10 లక్షల ఉచిత ప్రమాదబీమా సౌకర్యం కల్పించాలన్నారు. లేకుంటే ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఉద్యమానికి సిద్ధమన్నారు. ఈ కార్యక్రమంలో యూనియన్ అధ్యక్షురాలు మరియమ్మ, ప్రధాన కార్యదర్శి కె. కల్పన, నాయకురాలు శాంతమ్మ, అమ్ములు,శోభారాణి, అనసూయమ్మ, బాలకుళాయమ్మ, బాలగంగమ్మ, శ్రీదేవి, లలిత, పద్మావతి, దేవి, సుధారాణి, ఆశాకార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా కాశిరెడ్డినాయన ఆరాధన

వీరపునాయునిపల్లె, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): ఎన్.పాలగిరి క్రాస్ వద్దఉన్న అవధూత కాశిరెడ్డినాయన ఆలయలో ఆదివారం ఆరాధన ఉత్సవాలు వైభవంగా జరిగాయి. ఉదయం 6 గంటల నుంచి కాశినాయనకు ప్రత్యేక పూజలు జరిపించారు. అమ్మఒడి చారిటబుల్ ట్రస్ట్ అధినేత ఇసుకపల్లె రాజశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో అన్నదానం చేశారు. స్వామివారి సేవలో ఎస్‌వీఆర్‌ఎస్‌ఎం బీఈడీ కళాశాల, డిగ్రీ కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు, ఆలయ నిర్వాహకులు లక్ష్మీరెడ్డి, అమ్మఒడి చారిటబుల్ ట్రస్ట్ అధినేత ఇసుకపల్లె రాజశేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రసవత్తరంగా బండలాగుడు పోటీలు

ఎన్.పాలగిరి క్రాస్ వద్ద వెలసిన శ్రీఅవధూత కాశినాయన ఆరాధన ఉత్సవాల సందర్భంగా ఏర్పాటుచేసిన బండలాగుడు పోటీలు రసవత్తరంగా సాగాయి. విజేతలకు మాజీ ఎంపీపీ ప్రసాద్‌రెడ్డి, ఆల య నిర్వాహకులు లక్ష్మిరెడ్డి తదితరులు బహుమతులు అందించారు.

భూమి పూజ

పులివెందుల రూరల్, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): పులివెందులలో స్నేహిత అమృత హస్తం సేవా సమతి నూతన భవన నిర్మాణానికి ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి ఆదివారం భూమిపూజ చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉచిత విద్య ఉపాధ్యాయ బృందం సేవలను, నేత్ర సేకరణ, కొవిడ్‌లో సేవా సమితి చేసిన సేవలు తదితర సామాజిక సేవా కార్యక్రమాలను కొనియాడారు. సేవా సమితి విస్తృత సేవలకు మెచ్చి స్థలాన్ని దానం చేయడం శుభపరిణామమన్నారు. స్థల దాత రాజశేఖర్ గుప్తాను శాలువ, పూలమాలలతో సత్కరించారు.

మేమేమి చేశాము..పాపం!

● మారుమూల గ్రామం బీఎన్‌తాండా వాసుల ఆవేదన



అలంకారప్రాయంగా ఓవర్‌హెడ్ ట్యాంకు



వృథాగా రూ.4కోట్లతో నిర్మించిన ట్యాంకు



ఎర్రగుడి బీఎన్‌తాండాలో ఎండిపోయిన బోరు

చక్రాయపేట, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మారుమూల గిరిజన ప్రాంతం అభివృద్ధికి ఆమడదూరంలో ఉంది. అదే ఎర్రగుడి గ్రామం బీఎస్‌తాండా. వివరాలు ఇలా ఉన్నాయి.. మండలంలోని 120 గ్రామాలకు మంచినీటిని అందించాలనే ఉద్దేశంతో అప్పట్లో వైఎస్ రాజశేఖర్‌రెడ్డి రాచపల్లె సమీపాన రూ.4 కోట్లు ఖర్చు పెట్టి మంచినీటి పథకం ప్రారంభించారు. కానీ అది లక్ష్యాన్ని చేరలేకపోయింది. అధికారుల నిర్లక్ష్యం, పాలకుల ఉదాసీనత కారణంగా చేరలేకపోయిందనే విమర్శలున్నాయి. ముఖ్యంగా మారుమూల ప్రాంతాలైన కల్లూరుపల్లె, సిద్దావాండ్లపల్లె, ఎర్రగుడి, బీఎన్ తాండా, గరుగుతాండాలకు తాగునీరు అందించాలనే ఉద్దేశంతో ఈ పథకం చేపట్టారు. పైప్‌లైన్లు వేశారు. ఓవర్‌హెడ్ ట్యాకులు కట్టారు, ట్యాంకులకు పైపులు వేశారు. కానీ కనెక్షన్ మరిచారు. ఈ నేపథ్యంలో బీఎన్‌తాండా వాసుల దాహార్తి తీర్చే నాథుడే లేకుండాపోయాడు. మండల కేంద్రానికి రావాలంటే సరైన రోడ్డు, బస్సు లేకపోవడంతో 25 కిలోమీటర్లు రావాల్సిందే. గ్రామంలో వర్షాకాలం అయినప్పటికి నీటిఎద్దడి ఉంది. గ్రామంలో మూడు చేతిపంపులు, ఒక మంచినీటి పథకం కాలిపోయాయి. భూగర్భజలాలు అడుగంటి బోర్లు ఎండిపోవడంతో నీటికి ఇబ్బందులు పడుతున్నామని స్థానికులు అంటున్నారు. అయితే రాచపల్లె నీటి కోసం ఒక ట్యాంకు కట్టి పైప్‌లైన్లు ఇచ్చారు. కానీ నీరు రాదు. ఇక వేసవిలో కష్టాలు వర్ణనాతీతం. గ్రామంలో ఆరువేల గొర్రెలు, వెయ్యికి పైగా పాడిపశువులు ఉన్నాయని, గతంలో రోగాలు వచ్చి పశువులు వందలాదిగా చనిపోయాయని వారు తెలిపారు. మూగజీవాలపై ఆధారపడి జీవిస్తున్నామని, వాటికి రోగాలు వస్తే వైద్యులు కూడా ఇటువైపు రారని అంటున్నారు. కూటమి ప్రభుత్వం అయిన మా సమస్య తీర్చాలని కోరుతున్నారు. దాదాపు వంద కుటుంబాలు ఉన్న ఈ గ్రామంలో ఒక్క మంచినీటి పథకం అయినా లేకపోతే ఎలా అని ప్రశ్నిస్తున్నారు. కనీసం రాచపల్లె నీరు అయినా వస్తే మేలని వారు పేర్కొంటున్నారు.



పాపాఘ్ని నదిలో పైప్‌లైన్ లీక్ అయి వృథా అవుతున్న నీరు

పరీక్షలు జరుగుతున్న సమయంలో

శిక్షణ ఏమిటి: యూటీఎఫ్

కడప ఎడ్యుకేషన్, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): సమ్మెటివ్ పరీక్షలు జరుగుతున్న సమయంలో ఉపాధ్యాయులకు నాయకత్వ శిక్షణ తరగతులు నిర్వహించడం సరికాదని యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి లక్ష్మీరాజా, జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మాదన విజయకుమార్, పాలెం మహేష్‌బాబు తెలిపారు. ఆదివారం యూటీఎఫ్ భవన్‌లో జరిగిన టీచర్స్ ఎమ్మెల్సీ షేక్ సాబ్జి వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా విద్యార్థులకు ఈనెల 11 నుంచి 19 వరకు సమ్మెటివ్ పరీక్షలు జరుగుతున్నాయని, ఇలాంటి సమయంలో ఉపాధ్యాయులకు శిక్షణ తరగతులను నిర్వహించడం సరికాదన్నారు. ఈ నిర్ణయాలను వెనక్కి తీసుకోకుంటే ఉద్యమాన్ని చేపడతామని, శిక్షణ తరగతులను బహిష్కరిస్తామని హెచ్చరించారు. జిల్లా సహాధ్యక్షుడు రవికుమార్, సుజాతరాణి, జిల్లా ట్రెజరర్ నరసింహారావు, జిల్లా కార్యదర్శులు శ్రీనివాసులు, ఏజాస్ అహమ్మద్, ఈరి బాలజోజి, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు ఓబుల్‌రెడ్డి, రూతు ఆరోగ్యమేరి, కృష్ణారెడ్డి పాల్గొన్నారు.

రిమ్స్ వద్ద అల్పాహారం వితరణ

కడప నాగరాజుపేట, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): హిమవర్షిణి ఫౌండేషన్ ఆధ్వర్యంలో రిమ్స్ ఆసుపత్రి వద్ద రోగుల బంధువులకు ఆదివారం అల్పాహారం అందజేశారు. కువైత్‌లో ఉంటున్న ఒంటిమిట్టకు చెందిన ఉద్దండం శ్రీను, లక్ష్మీల పెళ్లిరోజు సందర్భంగా ఫౌండేషన్ ద్వారా అల్పాహారం ఏర్పాటు చేసినట్లు వ్యవస్థాపక అధ్యక్షురాలు గుండ్లకొండ విజయలక్ష్మి తెలిపారు.

తెలుగు ప్రజల ఆత్మగౌరవానికి ప్రతీక అమరజీవి





కడప: పొట్టిశ్రీరాములు విగ్రహం వద్ద నివాళులర్పించిన మాజీ డిప్యూటీ సీఎం అంజద్‌బాషా... పులివెందుల: జేఎన్టీయూలో అమరజీవికి నివాళి

కడప ఎడ్యుకేషన్, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): తెలుగు ప్రజల ఆత్మగౌరవానికి ప్రతీక అమరజీవి పొట్టి శ్రీరాములు అని మాజీ ఉప ముఖ్యమంత్రి అంజద్‌బాషా అన్నారు. రాష్ట్ర సాధన కోసం ప్రాణాలర్పించిన త్యాగశీలి అని కొనియాడారు. ఆదివారం పొట్టి శ్రీరాములు వర్ధంతి సందర్భంగా కడప నగరం గోకుల్ సర్కిల్‌లో ఉన్న పొట్టి శ్రీరాములు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. తెలుగువారి గొప్పతనాన్ని చాటి చెప్పిన మహనీయుడన్నారు. అంటరానితనం నిర్మూలనకు ఆయన చేసిన కృషి ఎనలేనిదన్నారు. ఆంధ్రుల చిరకాల స్వప్నమైన ప్రత్యేక రాష్ట్రాన్ని సాధించేందుకు మద్రాసులో 1952 అక్టోబరు 19న బులుసు సాంబమూర్తి ఇంట్లో నిరాహార దీక్ష ప్రారంభించారన్నారు. 8 రోజుల పాటు సాగిన ఆమరణ నిరాహార దీక్ష ఫలితంగా డిసెంబరు 15న తన ఆశయ సాధనలో ప్రాణాలర్పించి అమరజీవి అయ్యారన్నారు. ఈ కార్యక్రమంలో వైసీపీ నాయకులు కరిముల్లా, పులి సునిల్‌కుమార్, ఆదిత్య, షఫి, వినోద్‌కుమార్, ఇలియాస్ తదితరులు పాల్గొన్నారు.

అమరజీవికి ఘననివాళి

పులివెందుల రూరల్, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రరాష్ట్ర సాధకుడు అమరజీవి పొట్టి శ్రీరాములుకు పులివెందులలో ఘన నివాళులు అర్పించారు. ఆదివారం పొట్టి శ్రీరాములు వర్ధంతి సందర్భంగా స్థానిక జేఎన్టీయూ కళాశాలలో ప్రిన్సిపాల్ డి.విష్ణువర్ధన్, వైస్ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ కె.శేషమహేశ్వరమ్మలు అమరజీవి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. తెలుగువారంతా ఒక్కటిగా ఉండాలని ప్రత్యేక రాష్ట్ర డిమాండ్‌తో ఆయన నిరాహార దీక్ష చేపట్టారన్నారు. ఆ దీక్షలోనే ఆయన తనప్రాణాలను విడిచిపెట్టి చిరస్మరణీయుడుగా చరిత్రలో నిలిచారన్నారు. ఈ కార్యక్రమంలో అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థులుపాల్గొన్నారు.

నివాళులర్పించిన ఎంపీ

అమరజీవి పొట్టిశ్రీరాములుకు ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి నివాళులర్పించారు. అమరజీవి వర్ధంతి సందర్భంగా స్థానిక పూలంగళ్ల సర్కిల్‌లో ఉన్న ఆయన విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఆయన వెంట మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్, మార్కెట్‌యార్డు మాజీచైర్మన్ చిన్నప్ప పాల్గొన్నారు.

పొట్టి శ్రీరాములు, వల్లభాయ్ పటేల్ ఆదర్శనీయులు

కడప కలెక్టరేట్, డిసెంబరు 15(ఆంధ్రజ్యోతి): కడప నియోజకవర్గ అసెంబ్లీ కో-ఆర్డినేటర్ బండిజకరయ్య అధ్యక్షతన జిల్లా కాంగ్రెస్ కార్యాలయంలో పొట్టి శ్రీరాములు 77వ వర్ధంతి, సర్దార్ వల్ల భాయ్ పటేల్ 74వ వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. వారి చిత్ర పటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు శాలమ్మ, గంగయ్య, సంజయ్ కాంత, నాగరత్న, గౌస్, సిద్దిక్, మోషే తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా పొట్టి శ్రీరాములు వర్ధంతి

కడప(వినాయకనగర్), డిసెంబరు15(ఆంధ్రజ్యోతి): నగరంలోని సాయిబాబా అనాథశరణాలయంలో కొండా పాలకొండయ్య చారిటబుల్ ట్రస్టు చైర్మన్ కొండా సుబ్బయ్య ఆధ్వర్యంలో ఆదివారం అమరజీవి పొట్టి శ్రీరాములు వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కొండా సుబ్బయ్య మాట్లాడుతూ తెలుగు రాష్ట్రం ఒకటేనని, ప్రజలందరూ బాగుండాలని త్యాగం చేసిన మహనీయుడు పొట్టి శ్రీరాములు అని కొనియాడారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో రాయల్ కరీముల్లా, మేనేజర్ బద్రినారాయణ, విద్యార్థులు పాల్గొన్నారు.

సీకేదిన్నెలో...

చింతకొమ్మదిన్నె ఎంపీడీఓ కార్యాలయంలో ఆదివారం అమరజీవి పొట్టి శ్రీరాములు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈవోఆర్‌డీ టి.వి.సుబ్బారెడ్డి పాల్గొన్నారు. కొలుములపల్లె హైస్కూలులో వర్ధంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు.

కమలాపురంలో...

స్థానిక కోదండ రామాలయంలో ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు కామిశెట్టి వెంకట రమణయ్య పొట్టి శ్రీరాములు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో రెడ్డి సురేష్, ఆర్యవైశ్య సంఘం నాయకులు మాలేపాటి మల్లికార్జున, రెంటాల సురేష్ గుప్త, గ్రేటర్ వాసవి క్లబ్ ప్రెసిడెంట్ బచ్చు సు బ్రమణ్యం, భోజనపాటి సుధాకర్ బాబు, గాజులపల్లె చం ద్రశేఖర్, అంబటి సునీల్, కాంబోజి బ్రహ్మయ్య, తల్లం రజనీకాంత్ తదితరులు పాలొన్నారు.

మెస్ చార్జీలు విడుదల చేయాలి

కమలాపురం రూరల్, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ ప్రభుత్వ వసతి గృహాలలో పెండింగ్‌లో ఉన్న మెస్, కాస్మొటిక్స్ చార్జీలను తక్షణమే విడుదల చేయాలని ప్రగతిశీల రెవల్యూషనరీ విద్యార్థి యువజన సంఘం (పీఆర్‌ఎస్‌వైఎఫ్) నేతలు డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక ప్రభుత్వ బీసీ బాలుర కళాశాల వసతి గృహంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు స్పందించి పెండింగ్‌లో ఉన్న మెస్, కాస్మొటిక్స్ చార్జీలను విడుదల చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో పీఆర్‌ఎస్‌వైఎఫ్ కమలాపురం పట్టణ నాయకులు మురళి, భరత్ పాల్గొన్నారు.

ఇంటర్ కాలేజియేట్ వాలీబాల్

రన్నరప్ ట్రోఫీ కైవసం

కమలాపురం రూరల్, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): ప్రొద్దుటూరులోని వైఎస్సార్ ఇంజనీరింగ్ కళాశాలలో జరిగిన ఇంటర్ కాలేజియేట్ వాలీబాల్ టోర్నమెంట్‌లో ఇంటర్ కళాశాల, కమలాపురం వాలీబాల్ జట్టు ప్రతిష్ఠాత్మక రన్నరప్ స్థానాన్ని కైవసం చేసుకుందని కళాశాల ప్రిన్సిపాల్ రమణారెడ్డి తెలిపారు. అదేవిధంగా ఫస్ట్ బీకాం విద్యార్థి విష్ణువర్ధన్ చెన్నైలో జరగాల్సిన సౌత్ జోన్ కబడ్డీ టోర్నమెంట్‌లో కళాశాలకు ప్రాతినిధ్యం వహించడానికి ఎంపికయ్యాడన్నారు.

మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలు పరిష్కరించండి

● రాష్ట్ర అధ్యక్షురాలు స్రవంతి



సమావేశంలో మాట్లాడుతున్న స్రవంతి

కడప సెవెన్‌రోడ్స్, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలు త్వరితగతిన పరిష్కరించాలని, లేని పక్షంలో ఉద్యమానికి సిద్ధమని మధ్యాహ్న భోజన కార్మికుల సంఘం రాష్ట్ర అధ్యక్షురాలు కె. స్రవంతి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం ఏఐటీయూసీ కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. సమస్యలు పరిష్కరించాలని అనేకసార్లు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లినా ఫలితం లేదన్నారు. డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకంలో రాష్ట్ర వ్యాప్తంగా 85 వేల మంది ఈ పథకంలో పనిచేస్తున్నారని, కాగా 24 సంవత్సరాలుగా పనిచేస్తున్న మధ్యాహ్న భోజన కార్మికులను ప్రభుత్వాలు మారినప్పుడల్లా తొలగించడం దారుణమన్నారు. కార్మికులను అర్ధాంతరంగా తొలగించడం వల్ల వారి కుటుంబాలు జీవనోపాధి కోల్పోతున్నాయన్నారు. కరోనా కష్టకాలంలో కూడా చార్జీలు పెంచలేదన్నారు. గత నెలలో కేంద్ర ప్రభుత్వం ఎలిమెంటరీ స్కూల్‌కు 74 పైసలు, హైస్కూల్‌కు ఒక రూపాయి 12 పైసలు పెంచాయని, అది ఏ మాత్రమూ సరిపోదన్నారు. రెండు దశాబ్దాలుగా పనిచేస్తున్న కార్మికులకు ప్రస్తుతం మూడు వేల రూపాయలు ఇస్తున్నారని, తక్షణమే పదివేలకు పెంచాలని డిమాండ్ చేశారు. సమావేశంలో ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు గుంటి వేణుగోపాల్, కార్యదర్శి నాగసుబ్బారెడ్డి, సంఘం నాయకురాలు మేరి, లక్ష్మీపార్వతి తదితరులు పాల్గొన్నారు.

ఉల్లాసంగా.. ఉత్సాహంగా 'చీర్‌ఫుల్ కడప'



చీర్‌ఫుల్ కడప కార్యక్రమానికి హాజరైన కడప నగర ప్రజలు

కడప ఎడ్యుకేషన్, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): కడప మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ ఎస్.మనోజ్‌రెడ్డి ఆధ్వర్యంలో రాజీవ్‌పార్కు సమీపంలో ఏర్పాటు చేసిన చీర్‌ఫుల్ కడప కార్యక్రమం ఉల్లాసంగా ఉత్సాహంగా సాగింది. ఈ కార్యక్రమానికి అన్ని వర్గాల ప్రజలు హాజరయ్యారు. పుర ప్రజలకు ఆటవిడుపు కలిగించేందుకు కార్పొరేషన్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. చిన్నారులకు వివిధ రకాల క్రీడలు నిర్వహించారు. అలాగే చిన్నారుల్లో ఉన్న కళానైపుణ్యాన్ని ప్రదర్శించేందుకు వీలుగా ఏర్పాట్లు చేశారు. చిన్నారులు కూడా ఉత్సాహంగా పాల్గొని వారి కళలను ప్రదర్శించారు.

కృత్రిమ పాదాల కొలతల శిబిరం

కడప ఎడ్యుకేషన్, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో చేతన ఫౌండేషన్ ఆధ్వర్యంలో కృత్రిమ పాదాల కొలతల శిబిరం ఆదివారం ఏర్పాటు చేశారు. కడప నగరం యూటీఎఫ్ భవనంలో వికసిత ఫౌండేషన్‌తో కలిసి ఈ కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు చేతన ఫౌండేషన్ సభ్యుడు దొడ్డా సీతారామయ్య తెలిపారు.

ఘనంగా హరిప్రసాద్ జన్మదిన వేడుకలు



టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి హరిప్రసాద్‌ను సత్కరిస్తున్న పార్టీ నేతలు

కడప ఎడ్యుకేషన్, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): కడప నగరం హరిటవర్స్‌లో ఆదివారం టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి హరిప్రసాద్ జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. ముందుగా టీడీపీ నాయకులు హరిప్రసాద్‌కు శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం కేక్‌లు కట్ చేసి పంచిపెట్టారు. అలాగే హరిప్రసాద్‌కు శాలువకప్పి సత్కరించారు. ఈ కార్యక్రమంలో బండి బాబు, బండారు సత్యనారాయణ, మన్యం చలపతిరావు, అబ్బిశెట్టి వెంకటేశ్వర్లు, గంధం ప్రసాద్, దండు రవిసాయి పాల్గొన్నారు.

వర్గీకరణతోనే 59 ఉప కులాలకు సమన్యాయం : ఎమ్మార్పీఎస్



మాట్లాడుతున్న కృపాకర్ మాదిగ

కడప మారుతీనగర్, డిసెంబర్ 15, (ఆంధ్రజ్యోతి): ఎస్సీ వర్గీకరణతోనే ఆ జాబితాలోని 59 ఉప కులాలకు సమన్యాయం జరుగుతుందని మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి వ్యవస్థాపక ప్రధాన కార్యదర్శి కృపాకర్ మాదిగ అన్నారు. ఆదివారం కడప ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎస్సీలలో వెనుకబడిన ఇతర కులాలను కూడా కలుపుకుని సామాజిక న్యాయం కోసం పోరాడుదామని పిలుపునిచ్చారు. మాల, మాదిగలతో పాటు ఎస్సీలలోని అన్ని కులాలు అభివృద్ధి చెందాలన్నారు. దళిత నాయకులు చీపాటి రాజేశ్వరరావు,స్వామినాథం, కె.ఎల్లయ్య, కె. బాలరాజు, జాలా ప్రభాకర్, సగిలి గుర్రప్ప, బాబు, డాక్టర్ గురువయ్య, తదితరులు పాల్గొన్నారు.

ఆయన అమరజీవి

ఘనంగా పొట్టిశ్రీరాములు వర్ధంతి ● నివాళులర్పించిన ఆర్యవైశ్యులు, ప్రజాప్రతినిధులు, వివిధ పార్టీల నాయకులు

ప్రొద్దుటూరు టౌన్, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి):అమరజీవి పొట్టిశ్రీరాములు వర్ధంతిని ఆర్యవైశ్య సభ నిర్వాహకులు ఘనంగా నిర్వహించారు. ఆదివారం ఉదయం లైట్‌పాళెం సెంటర్‌లోని పొట్టిశ్రీరాములు విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఆర్యవైశ్య సభ అధ్యక్షుడు బుశెట్టి రామమోహన్‌రావు మాట్లాడుతూ పొట్టి శ్రీరాములు ప్రాణ త్యాగంతోనే ప్రత్యేక రాష్ట్రం ఆవిర్భవించిందన్నారు. ఆంధ్రరాష్ట్రం కోసం ఆయన 58 రోజులు ఆమరణ నిరాహార దీక్ష చేసి ప్రాణత్యాగం చేశారన్నారు. ఆయన త్యాగాన్ని గుర్తించిన కూటమి ప్రభుత్వం ఆయన వర్ధంతిని ఆత్మార్పణ దినోత్సవంగా ప్రకటించడం ఆనందదాయకం. కూటమి ప్రభుత్వానికి ఆర్యవైశ్యుల తరపున కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య సభ ఉపాధ్యక్షుడు జొన్నలగడ్డ రవీంద్రబాబు, కార్యదర్శి మురికి నాగేశ్వరరావు, సహాయ కార్యదర్శి మురికి సుబ్రహ్మణ్యం, డాక్టర్ వెంకటరావు తదితరులు పాల్గొన్నారు.



ప్రొద్దుటూరులో పొట్టిశ్రీరాములు విగ్రహానికి నివాళులర్పిస్తున్న ఆర్యవైశ్యులు - పోరుమామిళ్లలో ఎస్టీయూ నేతలు....

బద్వేలులో....

బద్వేలు, డిసెంబర్ 15 (ఆంధ్రజ్యోతి): అమరజీవి పొట్టి శ్రీరాములు వర్ధంతి సందర్భంగా ఆదివారం ఆర్యవైశ్య వర్తక సంఘం అధ్యక్షుడు కేవీసుబ్బారావు, నాగరాజు, గౌరవాధ్యక్షులు పీవీఎస్.ప్రసాద్ ఆధ్వర్యంలో పొట్టి శ్రీరాములు వర్ధంతి నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

మైదుకూరులో....

మైదుకూరు రూరల్,డిసెంబరు 15(ఆంధ్రజ్యోతి): ఆంధ్రరాష్ట్ర అవతరణ కోసం తన ప్రాణాలను సైతం లెక్క చేయని వ్యక్తి పొట్టి శ్రీరాములని మైదుకూరు ఆర్యవైశ్య సభ అధ్యక్షుడు నూరిశెట్టి ప్రసాద్ గుప్త అన్నారు. ఆదివారం అమరజీవి పొట్టి శ్రీరాములు వర్ధంతి సందర్భంగా అమ్మవారుశాల నుంచి ర్యాలీగా బదేలు రోడ్డులోని పొట్టిశ్రీరాములు విగ్రహం వరకు వెళ్లి నివాళులర్పించారు. కార్యక్రమంలో మలిపెద్దు హరినాథ్, సునీల్ తదితరులు పాల్గొన్నారు.

పోరుమామిళ్లలో ఎస్టీయూ నేతలు

పోరుమామిళ్ల, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రరాష్ట్రం సాధన కోసం ఆమరణ దీక్ష చేసి ప్రాణాలను అర్పించిన అమరజీవి పొట్టిశ్రీరాములుకు ఎస్టీయూ నేతలు నివాళులర్పించారు. ఆదివారం పోరుమామిళ్లలో పొట్టిశ్రీరాములు వర్ధంతి నిర్వహించారు. కార్యక్రమంలో ఎస్టీయూ నేతలు రామక్రిష్ణారెడ్డి, చంద్రహాస్‌రెడ్డి, వెంకటరామయ్య, పుల్లయ్య, ఎస్.చెన్నయ్య, ప్రకాష్‌రావు, వారణాసి రవీంద్ర పాల్గొన్నారు.

ఘనంగా దత్తాత్రేయస్వామి జయంతి



ప్రొద్దుటూరు టౌన్, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): దత్తాత్రేయ స్వామి ఆలయంలో ఆదివారం దత్త జయంతిని ఘనంగా నిర్వహించారు. ఉదయం స్వామివారి మూలవిరాట్టుకు దత్తాత్రేయ స్వామి, అనఘాదేవి ఉత్సవ మూర్తులకు పంచామృతాభిషేకం, సుగంద ద్రవ్యాలతో అభిషేకాలు నిర్వహించి ప్రత్యేకంగా అలంకరించారు. భక్తులు పెద్ద సంఖ్యలో స్వామివారిని దర్శించి కాయా కర్పూరం సమర్పించారు. మధ్యాహ్నం ఆలయ నిర్వాహకులు అన్నప్రసాదం పంపిణీ చేశారు.

వేడుకగా కాశినాయన ఆరాధన



పూజలందుకుంటున్న కాశిరెడ్డినాయన

కొండాపురం, డిశంబరు 15 (ఆంధ్రజ్యోతి): చౌటిపల్లె కాశిరెడ్డి నాయన ఆలయంలో ఆదివారం కాశిరెడ్డినాయన ఆరాధనోత్సవం ఘనంగా నిర్వహించారు. ఆలయంలోని గణపతి, అన్నపూర్ణేశ్వరి, కాశిరెడ్డి నాయన విగ్రహాలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నదానం ఏర్పాటు చేసి భజన నిర్వహించారు. కార్యక్రమంలో పెద్ద ఎత్తున భక్తులు పాల్గొన్నారు.

సుస్థిర అభివృద్ధి లక్ష్య సాధనపై శిక్షణ

పోరుమామిళ్ల, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో సుస్థిర అభివృద్ధి సాధించడం కోసం అధికారులు, ప్రజా ప్రతినిధులకు 17, 18 తేదీల్లో శిక్షణ నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ రమణారెడ్డి తెలిపారు. శ్రీశక్తిభవనం రంగసముద్రం రైతు సేవాకేంద్రాల్లో రెండు బ్యాచ్‌లుగా శిక్షణ ఇస్తామన్నారు. మండలంలోని అన్నిశాఖల అధికారులు, సచివాలయ సిబ్బంది, సర్పంచ్‌లు ఇతర ప్రజాప్రతినిధులకు ఈ శిక్షణ ఉంటుందని, అందరూ తప్పనిసరిగా హాజరవాలన్నారు.

నేటి నుంచి నగర సంకీర్తన

మైదుకూరు రూరల్, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): ధనుర్మాసం సందర్భంగా సోమవారం నుంచి పట్టణంలో నగర సంకీర్తనల కార్యక్రమం ఉంటుందని నిర్వాహకులు మలిపెద్దు హరినాథ్ తెలిపారు. అచలానంద స్వామి ఆశ్రమ పీఠాధిపతి విరజానంద స్వామి ఆధ్వర్యంలో తెల్లవారుజామున 4.30 గంటలకు లక్ష్మీ మాధవరాయ స్వామి ఆలయం నుంచి ప్రారంభమై, వనిపెంట రోడ్డులోని అంకాలమ్మ గుడి వరకు ఈ నగర సంకీర్తనల కార్యక్రమం ఉంటుందని ఆయన తెలిపారు. కావున హిందూ బంధువులందరూ ఈ నగర సంకీర్తనల కార్యక్రమానికి హాజరవాలని ఆయన కోరారు.

పేదలకు దుప్పట్లు పంపిణీ



దుప్పట్లు పంపిణీ చేస్తున్న దృశ్యం

బద్వేలు, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): అరవింద్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో పేదలకు దుప్పట్లను పంపిణీ చేసినట్లు బద్వేలు గురుమూర్తి పేర్కొన్నారు. రాజస్తాన్ నుంచి వచ్చి కొలిమి పనులు చేసుకునే వారికి, అనాథలకు దుప్పట్లు పంపిణీ చేసినట్లు ఆయన తెలిపారు. అరవింద ఫౌండేషన్ సభ్యులు, పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరం

బద్వేలు, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని సుందరయ్య కాలనీలో డీవైఎఫ్ఐ ఆధ్వర్యంలో ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. పేదలకు ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సంజీవని మల్టీస్పెషాలిటీ హాస్పిటల్ డాక్టర్లు డాక్టర్ సుమంత్, సరస్వతి, పవిత్ర తదితరులు పాల్గొన్నారు.

రన్నరప్ ట్రోఫీ కైవసం

కమలాపురం రూరల్, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): ఇంటర్ కాలేజియేట్ వాలీబాల్ టోర్నీలో కమలాపురం జట్టు రన్నరప్ ట్రోఫీని కైవశం చేసుకుందని కళాశాల ప్రిన్సిపాల్ రమణారెడ్డి తెలిపారు. ప్రొద్దుటూరులోని వైఎస్సార్ ఇంజనీరింగ్ కళాశాలలో జరిగిన ఇంటర్ కాలేజియేట్ వాలీబాల్ టోర్నమెంట్‌లో ఫస్ట్ టీకాం విద్యార్థి విష్ణువర్దన్ ప్రతిభ చాటారన్నారు. చెన్నైలో జరిగే సౌత్ జోన్ కబడ్డీ టోర్నమెంట్‌లో కళాశాల నుంచి ప్రాతినిధ్యం వహించడానికి ఎంపికయ్యాడన్నారు. ఎంపికైన విష్ణును కళాశాల యాజమాన్యం అభినందించింది.

ఘనంగా చండీహోమం



పూర్ణాహుతి సమర్పిస్తున్న దృశ్యం

ప్రొద్దుటూరు టౌన్, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): స్థానిక అగస్త్యేశ్వరస్వామి ఆలయంలో మార్గశిర పౌర్ణమి సందర్భంగా చండీహోమం ఘనంగా నిర్వహించారు. ఆదివారం ఉదయం అగస్త్యేశ్వరస్వామికి మహన్యాసపూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, రాజరాజేశ్వరిదేవి అమ్మవారికి సహస్రనామ కుంకుమార్చనలు నిర్వహించారు. పూజలు అనంతరం లోక కల్యాణార్థం గోపూజ, గణపతి, నవగ్రహ, ఉపగ్రహ, చండీ మహాహోమాలను నిర్వహించి పూర్ణాహుతి సమర్పించారు. కార్యక్రమంలో ఆలయ ఛైర్మన్ కొత్తమిద్దె రఘురామిరెడ్డి, ఈఓ రామచంద్రాచార్యులు, వేదపాఠశాల గురువు వెంకటేష్‌శర్మ, తదితరులు పాల్గొన్నారు.

మాలల మహాగర్జనకు తరలివెళ్లిన నేతలు

పోరుమామిళ్ల, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): గుంటూరులో ఆదివారం జరిగిన మాలల మహాగర్జనకు పోరుమామిళ్ల నుంచి దాదాపు 50 మంది మాలసామాజిక వర్గ నేతలు వాహనాల్లో తరలివెళ్లారు. ఆదివారం వారు స్థానిక పోరుమామిళ్లలోని అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేశారు. అనంతరం గుంటూరుకు తరలివెళ్లారు. వీరిలో అంబేడ్కర్‌సేన ఆర్గనైజింగ్ కార్యదర్శి ముత్యాల ప్రసాదరావు, జడ్పీటీసీ ముత్యాల ప్రసాద్, ఆ సంఘం నేతలు కిరణ్‌కుమార్, వినయ్‌కుమార్, వీరయ్య, రాజశేఖర్, జేఏసీ ప్రజా సంఘాల నాయకులు పాల్గొన్నారు.

ఏడు టీసీలు వైసీపీ సొంతం : ఎమ్మెల్సీ

జమ్మలమడుగు, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): కూటమి నేతలు ఎన్ని అడ్డంకులు సృష్టించినా చివరకు వైసీపీ మద్దతుదారులైన నీటి సంఘాల నేతలు గెలుపొందారని ఎమ్మెల్సీ రామసుబ్బారెడ్డి అన్నారు. పొట్టి శ్రీరాములు వర్ధంతిలో భాగంగా పాత బస్టాండులో విగ్రహానికి ఎమ్మెల్సీ, పార్టీ నేతలు నివాళులర్పించారు. వైసీపీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ పెద్దముడియం మండలంలో గుండ్లకుంట నీటి సంఘం సంబంధించి 12 టీసీల్లో ఎనిమిది టీసీలకు ఎన్నికలు జరిగితే ఏడు టీసీలు వైసీపీ మద్దతుదారులు గెలుపొందగా కూటమికి ఒక టీసీ వచ్చిందన్నారు. పెద్దముడియం మండలంలో 15 మంది గెలుపొందారన్నారు. మిగతా ప్రాంతాల్లో అధికారులు సర్టిఫికెట్లు ఇచ్చి ఉండి ఉంటే మరిన్ని టీసీలు వచ్చేవని ఆయన తెలిపారు. గెలుపొందిన టీసీలు ముల్లాజానీ, మార్పుల్ శ్రీను, యోబు, దన్నవాడ మహేశ్వరరెడ్డి, ఉప్పలపాడు గురప్ప, కేకే రమణారెడ్డి, వేణు, ఎనమల నారాయణరెడ్డి ఉన్నారు.

పేద విద్యార్థులకు ఆర్థికసాయం



విద్యార్థులకు ఆర్థికసాయం అందజేస్తున్నదృశ్యం

ప్రొద్దుటూరు టౌన్, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): చదువులో రాణిస్తున్న తొగటవీర క్షత్రియ విద్యార్థులకు క్షత్రియ సేవా సంఘం ఆధ్వర్యంలో ఆర్థికసాయం అందజేశారు. ఆదివారం తొగటవీర క్షత్రియ కల్యాణ మండపంలో జరిగిన కార్యక్రమంలో ఎంబీబీఎస్ తృతీయ సంవత్సరం విద్యార్థి గాలి శ్రీలీలకు కాలేజీ, హాస్టల్ ఫీజు రూ.25 వేలు, అగ్రికల్చరల్ బీఎస్సీ మొదటి సంవత్సరం విద్యార్థి బంగారు లావణ్యకు కళాశాల ఫీజు రూ.17 వేలు, జూనియర్ ఇంటర్ విద్యార్థి గంజికుంట శ్రావణికి కళాశాల ఫీజు రూ.10 వేలు ఆర్థికసాయం చేశారు. సంఘం అధ్యక్షుడు బండారు సూర్యనారాయణ మాట్లాడుతూ పేద విద్యార్థులను చదువులో ప్రోత్సహించడానికి సంఘం ద్వారా ఆర్థికసాయం అందజేస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో తొగటవీర క్షత్రియ సేవా సంఘం ప్రధాన కార్యదర్శి చౌడం వెంకటరమణ, కోశాధికారి గంజికుంట ఆంజనేయులు, ఉపాధ్యక్షుడు పట్టుపోగుల నాగేశ్వరరావు, ఉమ్మడిశెట్టి చౌడయ్య, సుబ్బరాయుడు, సుబ్బయ్య, పుల్లయ్య, రామయ్య, లక్ష్మినారాయణ, తదితరులు పాల్గొన్నారు.

ముద్దనూరు వాసి పుల్లారెడ్డికి డాక్టరేట్



బెంగళూరులో డాక్టరేట్ అందుకుంటున్న పుల్లారెడ్డి

ముద్దనూరు డిసెంబరు15(ఆంధ్రజ్యోతి): ముద్దనూరు మండల వాసి, విశ్రాంత తెలుగు అధ్యాపకులు బూచుపల్లి పుల్లారెడ్డికి భారత్ వర్చువల్ యూనివర్సిటీ ఫర్ పీస్ అండ్ ఎడ్యుకేషన్ (బెంగళూరు) డాక్టరేట్ ప్రధానం చేశారు. ఏజే ఇంటర్‌నేషనల్ ఫంక్షన్ హాలులో పుల్లారెడ్డి చేసిన కళలు. సాంస్కృతిక, పౌరాణిక నాటకాల్లో ప్రతిభ, అల్లూరి సీతారామరాజు, శ్రీకృష్ణదేవరాయలు వేషధారణలు, సామాజిక సేవలను పరిగణంలోకి తీసుకుని ప్రశంసా పత్రం, జ్ఞాపిక బహూకరించి, డాక్టరేట్ ప్రధానం చేశారు. వర్సిటీ వైస్ ఛైర్మెన్ డాక్టర్ తంగరాజన్, డీన్ డాక్టర్ స్వామినాథన్, సుప్రీం కోర్టు స్టాండింగ్ కమిటీ సభ్యులు రాఘసందేశం, ఇండియన్ ఆర్మీకల్నల్ సంజయ్‌కుమా ద్వారా డాక్టరేట్ అందుకున్నట్లు డాక్టరేట్ గ్రహీత పుల్లారెడ్డి తెలిపారు. పుల్లారెడ్డికి డాక్టరేట్ రావడంతో కుటుంబ సభ్యులు, స్నేహితులు, హర్షం వ్యక్తం చేశారు.

నూతన పద్ధతిలో కలుపు నివారణ



కలుపు తొలగిస్తున్న రైతు

దువ్వూరు, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): ఆరుతడి పంటలు వేసిన పొలాల్లో గడ్డి నివారణకు కూలీల ఖర్చు అధికమవుతోంది. ఈ పరిస్థితుల్లో కలుపు నివారణకు రైతులు సరికొత్త పద్ధతులు అనుసరిస్తున్నారు. మండలంలో పలు చోట్ల ఈ పద్ధతులు అవలంభిస్తున్నారు. కూలీల ఖర్చు తగ్గించేందుకు వినూత్న పద్ధతులు ఆచరణలో పెడుతున్నారు. ఒకటిన్నర నుంచి రెండు అడుగులు కలిగిన యంత్రాన్ని తయారు చేసి దానికి తాడు లేదా కర్రలు కట్టి పొలంలో లాగుతున్నారు. ఇలా చేయడం వలన భూమిలోని కలుపు మొక్కలు నివారించవచ్చు. కూలీల ఖర్చులేకుండా రోజుకు అర ఎకరాలో సులభంగా కలుపు నివారణ పనులు చేయవచ్చని రైతులు అంటున్నారు.

వర్షాలతో దెబ్బతిన్న మినుము



దువ్వూరు వద్ద వర్షంతో దెబ్బతిన్న మినుము పంట

దువ్వూరు, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): ప్రకృతి రైతులను ఇబ్బందులకు గురిచేస్తోంది. కొన్నింటికి భరోసా ఇచ్చినా, పరిస్థితులు అనుకూలించి పంటల సాగుకు ఊతమిచ్చింది. ప్రధానంగా మినుము పంట సాగు చేసిన రైతులను అకాల వర్షం దెబ్బతీసింది. దువ్వూరు మండలంలో రైతులు మినుము విరివిగా సాగు చేశారు. మొత్తం మీద ఖరీఫ్‌లో 400, రబీలో 1350 ఎకరాల్లో మినుము వేశారు. పెట్టుబడుల కింద ఎకరాకు 20 వేల వరకు ఖర్చు చేశారు. పరిస్థితులు అనుకూలిస్తే ఎకరాకు 8 నుంచి 9 క్వింటాళ్లు దిగుబడి అందనుంది. క్వింటా మినుములు రూ.9 వేల వరకు ధర పలుకుతోంది. అడపా దడపా ఈ ధర నిలకడ లోపిస్తోంది. అయితే ఈసారి అదును తప్పి పడుతున్న వర్షాలతో పొలాల్లో మినుము బాగా దెబ్బతినింది. ప్రధానంగా ఈ పంటకు పొలంలో తేమ శాతం అధిక శాతం ఉండకూడదు. అదును తప్పి పడుతున్న వానలతో రైతు నెత్తిన పిడుగు పడినట్లైంది. పొలంలోనే చాలా మేరకు పంట కుళ్లు తగిలి పనికిరాకుండా పోయింది. ఎకరాకు బాగా పండితే 7 నుంచి 9 క్వింటాళ్ల దిగుబడి రావాలి. ఇప్పటి పరిస్థితినే చూస్తే అతి కష్టంగా మూడు క్వింటాళ్లు కూడా వచ్చే పరిస్థితి కనపడడంలేదు. కొందరి పొలాలు పూర్తిగా పాడై అరకొర దిగుబడి కష్టంగా మారింది. పెట్టుబడుల మాట అటుంచి నష్టాలను ఎదుర్కొంటున్నారు. ఆరుగాలం శ్రమించినా ఫలితం లేదని అన్నదాతలు వాపోతున్నారు. మండలంలో మినుము సాగుకు రైతులు రూ.1.50 కోట్ల పెట్టుబడుల కింద వెచ్చించారని అంచనా.

ఐక్యతతో సమస్యలు పరిష్కారం

బీసీ కులాల ఆత్మీయ సమ్మేళన సభలో వక్తలు

నూతన కార్యవర్గం ఏర్పాటు

జమ్మలమడుగు, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): ఐక్యతతో సమస్యలు పరిష్కారానికి కృషి చేయాలని జమ్మలమడుగులో బీసీ సంఘం నేతలు పేర్కొన్నారు. ఆదివారం నాగులకట్ట వీధి చౌడేశ్వరీదేవి ఆలయం ఎదురుగా నియోజకవర్గంలోని బీసీ కులాల ఆత్మీయ సమ్మేళనలో పలువురు ప్రసంగించారు. స్థానిక నేతలు జాతీయ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బడిగించల చంద్రమౌళి, తొగటవీర క్షత్రియ సంక్షేమ సంఘం నేతలు కాటా రామదాసు ప్రసంగించారు. చేనేత కార్మికుల సమస్యలు పరిష్కరించుకుంటూ బీసీలంతా ఐక్యతతో రాజకీయంగా ఎదగాలని పిలుపునిచ్చారు. తమ సమస్యల సాధనకోసం ప్రతి ఒక్కరూ ముందుకు రావాలన్నారు.

నూతన కార్యవర్గం ఎన్నిక

ఆత్మీయ సమావేశం అనంతరం నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నట్లు వారు తెలిపారు. జిల్లా అధ్యక్షుడు బత్తల లింగమూర్తి, పార్లమెంటు అధ్యక్షుడు బొర్రా రామాంజనేయులు అధ్యక్షతన సమావేశం జరిగింది. నూతన కార్యవర్గంలో అధ్యక్షుడిగా చౌడం జొల్లు కొండయ్య, గౌరవాధ్యక్షుడిగా బడిగించల చంద్రమౌళి, వర్కింగ్ ప్రెసిడెంట్ కాటా రామదాసు, ప్రధాన కార్యదర్శి జీవన్, కోశాధికారిగా వెంకోబారావును ఎన్నుకున్నారు. 2025లో కేంద్రం చేపట్టనున్న జన గణనతో ఓబీసీ కుల గణనను వెంటనే చేపట్టాలని డిమాండ్ చేశారు. చట్టసభల్లో ఓబీసీలకు 50 శాతం రాజకీయ రిజర్వేషన్లు కల్పించేందుకు పార్లమెంటులో కేంద్రం వెంటనే బిల్లు ప్రవేశపెట్టాలన్నారు. ఓబీసీలకు కేంద్ర ప్రభుత్వ శాఖలను ఏర్పాటు చేయాలన్నారు. కమిషన్ రిపోర్టును కేంద్రం అమలుపరచాలన్నారు. 29వ తేదీ బీసీ సంక్షేమ సంఘం సమావేశం ఉంటుందని తీర్మానించారు.

నాటి స్నేహాలు మరువలేనివి



82-83 బ్యాచ్ విద్యార్థుల ఆత్మీయ కలయిక దృశ్యం

మైదుకూరు రూరల్,డిసెంబరు 15(ఆంధ్రజ్యోతి): అలనాటి స్నేహాలు మరువ లేనివని, బాల్యంలో చేసిన అల్లరి పనులు చెరిగివని మైదుకూరు మాజీ ఎంపీపీ ధనపాల జగన్ అన్నారు. స్థానిక జిల్లా పరిషత్ హైస్కూల్‌లో 1982-83 బ్యాచ్ పూర్వ విద్యార్థుల సమ్మేళనం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి హైస్కూల్‌లో చదివిన 1982 సంవత్సరం విద్యార్థులు పాల్గొన్నారు. పాఠశాల అభివృద్ధికి సహాయ సహకారాలు అందిస్తామని తెలిపారు. ఒకరికొకరు ఆప్యాయంగా పలకరించుకున్నారు. నాటి తీపి విషయాల గురించి మాట్లాడుకున్నారు. గతేడాది పాఠశాలలో అత్యుత్తమ మార్కులు పొందిన వారికి మెమెంటోలు, బహుమతులు అందచేశారు. కార్యక్రమంలో రవిప్రకాశ్, మహబూబ్‌బాష, వెంకటేశ్వర్లు, వెంకటరాముడు, హైస్కూల్ హెడ్ మాస్టర్ గోశెట్టి రామ్మోహన్, సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.